విశాలాంధ్ర



ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

బుధవారం 04 జూన్ 2025 8 పేజీలు

యథేచ్ఛగా కోళ్ల వ్యర్థాల తరలింపు

మామూళ్ల మత్తులో మున్సిపల్ అధికారులు

విశాలాంధ్ర-కొవ్వూరు : కొవ్వూరు పట్టణంలోని కోడి మాంసం దుకాణాల నుంచి ప్రతిరోజు సాయంకాల సమయంలో ఆ దుకాణాల వద్ద పోగైన కోడి మాంసం వ్యర్థాలను మినీ వ్యాన్ల ద్వారా ప్లాస్టిక్ టిన్లతో తరలిస్తున్నారు. ఇలా తరలించిన వాటిని కొవ్వూరు, నిడదవోలు మండలాల్లోని చేపల చెరువుల్లో వేస్తున్నారు. వీటిని చేపలు తినడం ద్వారా వాటి బరువు పెరుగుతున్నాయి. ఈ వ్యర్థాలను తిని చేపలు అనారోగ్యానికి గురవుతున్నాయి. వీటిని ప్రజలు కొనుగోలు చేసితినడం ద్వారా ప్రజలు కూడా అనారోగ్యానికి గురవుతున్నారు. ఇదంతా తెలిసి కూడా మున్సిపల్ అధికారులు ఏ రోజూ మాంసం దుకాణాల వద్దకు వెళ్లిన పాపాన పోలేదు. పైగా నెలవారి మామూళ్ల మత్తులో జోగుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి అసలే బర్డ్ ఫ్లూ, కరోనా వంటివ్యాధులు విజృంభిస్తున్న వేళ జిల్లా అధికారులు జోక్యం చేసుకుని ఈ వ్యర్థాలను తరలించే వారిని కఠినంగా శిక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

మున్సిపాలిటీకి కబేళా కరువు

రెవిన్యూ డివిజన్ కేంద్రమైన కొవ్వూరు పట్టణంలో ఇప్పటివరకు మేకలను కోసే కబేళా లేకపోవడం మున్సిపల్ అధికారులు పాలకుల నిర్లక్ష్యానికి అద్దం పడుతుంది. మేకలను ఎక్కడ కోస్తున్నారన్న విషయం ప్రశ్నగా మిగిలింది. వాస్తవానికి మేకలను పశు వైద్యాధికారి పరీక్షించి స్టాంపు వేయాల్సి ఉన్నా మేకలను బహిరంగ ప్రదేశాలలో వధించి మాంసం విక్రయిస్తున్నారని వినియోగదారులు వాపోతున్నారు. వధించిన మేకలు ఆరోగ్యంగా ఉన్నాయో లేక అనారోగ్యంతో ఉన్నాయో తెలియని అయోమయ స్థితిలో మేక మాంస వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పారిశుద్ధ్య కార్మికుల జీతాల చెల్లింపులో

నిర్లక్ష్యం విడనాడాలి

విశాలాంధ్ర - కాకినాడ : పారిశుద్ధ్య కార్మికుల జీతాల చెల్లింపులో నిర్లక్ష్యం విడనాడాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధ సంఘం) ఆధ్వర్యంలో కాకినాడ మున్సిపల్ కార్యాలయం వద్ద పారిశుధ్య కార్మికులు ధర్నా చేపట్టారు. ఈ ధర్నాకు ముఖ్య అతిథిగా హాజరైన ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ మాట్లాడుతూ కాకినాడలో 14వ సర్కిల్, 12వ సర్కిల్‌లో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల పట్ల హెల్త్ సెక్రటరీలు, ఇన్‌స్పెక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. మే నెలలో మండుటెండను సైతం లెక్కచేయకుండా పూర్తి స్థాయిలో పనిచేసినా ఎఫ్ఆర్ఎస్ తీయడంలో, మస్తర్లు వేయడంలో, బిల్లులు పెట్టడంలో సచివాలయ హెల్త్ సెక్రటరీలు, ఇన్‌స్పెక్టర్లు నిర్లక్ష్యంగా ▶మిగతా 2లో..

ప్రమాదం అంచున ప్రయాణం

విశాలాంధ్ర - సీతానగరం: ప్రమాదం అంచున నిత్యం రాకపోకలు కొనసాగుతున్నాయి. మండలంలోని చీపురుపల్లి గ్రామ సరిహద్దుల్లోని తొర్రగడ్డ పంట కాలువ పై నిర్మించిన కల్వర్టు ఆదివారం ఒక్కసారిగా ఒక ప్రక్కకు ఒరిగిపోయింది. కొద్ది సంవత్సరాలుగా ఈ కల్వర్టు శిథిలావస్థకు చేరి కల్వర్టు ఇరువైపుల ఉన్న గోడలు సైతం పడిపోయాయి. ఈ కల్వర్టు సామర్థ్యం 12 టన్నులు కాగా నాగంపల్లి శివారులోని క్వారీల నుండి నిత్యం 50 నుంచి 60 టన్నుల బరువుతో లారీలు ఎక్కువగా రాకపోకలు సాగించడం వల్ల ఈ కల్వర్టుకు ఈ దుస్థితి ఏర్పడిందని ప్రజలు విమర్శిస్తున్నారు. ఈ సమస్య అనేకమార్లు పత్రికల్లో వచ్చినప్పటికీ అధికారులు ఏమాత్రం చర్యలు చేపట్టకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ కల్వర్టు పై రాకపోకలు సాగించడం ప్రమాదకరంగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి కల్వర్టు పై అధిక బరువు గల వాహనాల రాకపోకలను నిషేధించకపోతే పెను ప్రమాదంగా మారి ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లే అవకాశం ఉంది. అధికారులు, నాయకులు స్పందించి ఈ కల్వర్టు నిర్మాణానికి తగు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రేషన్ డిపోలను పరిశీలించిన కలెక్టర్

విశాలాంధ్ర - రాజానగరం : ఏపీ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మ కంగా పునః ప్రారంభించిన చౌక డిపో కేంద్రాలను తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మంగళవారం పరిశీలించారు. మండలంలోని ▶మిగతా 2లో..

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన అందరి బాధ్యత

- 30 వరకు బాల కార్మిక వ్యతిరేక మాసోత్సవం

విశాలాంధ్ర-ఏలూరు: బాల కార్మిక వ్యవస్థ, బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలను,ఈ చర్యలకు పాల్పడే వారిపై తీసుకునే చట్టపరమైన అంశాలను విస్తృతంగా అవగాహన పరచాలని కలెక్టర్ కె. వెట్రిసెల్వి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ గౌతమీ సమావేశపు మందిరంలో కార్మిక శాఖ ఆధ్వర్యంలో సంబంధిత శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలెక్టర్ అధ్యక్షతన బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె. రత్నప్రసాద్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో భాగంగా కార్మిక శాఖచే బాల కార్మిక వ్యవస్థ నిషేధ చట్టంనకు సంబంధించిన అవగాహన గోడ పత్రికలను జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి , జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె. రత్నప్రసాద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ బాల, కౌమార కార్మిక వ్యవస్థ చట్టం- 1986 (సవరణ చట్టం 2016) మేరకు సెక్షన్ 3 కింద ఏ వృత్తిలో అయినా 14 నుంచి 18 సంవత్సరాలలోపు బాలలను ప్రమాదకరమైన పనుల్లో పెట్టుకొని పనిచేయించినా చట్టప్రకారం ▶మిగతా 2లో..

ఇళ్ల నిర్మాణ ప్రగతి సాధించాలి

కలెక్టర్ కె. వెట్రిసెల్వి

విశాలాంధ్ర-ఏలూరు: జిల్లాలో ఇళ్ల ప్రగతికి నిర్దేశించిన లక్ష్యాలను సాధించే దిశగా గృహనిర్మాణ శాఖ అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ నుండి నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఇళ్ల నిర్మాణ ప్రగతిపై హౌసింగ్ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిర్దేశించిన లక్ష్యాలను సాధించకపోతే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. రానున్న 10 రోజుల్లో ఇళ్ల నిర్మాణాల ప్రగతి కనబడాలన్నారు. ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి మృతి చెందిన లబ్దిదారుల కుటుంబాల్లో లీగల్ హైర్ కలిగి ఇళ్లు నిర్మించుకోవడానికి సుముఖత తెలిపేవారు, సుముఖత లేనివారు సమగ్ర వివరాలను బుధవారం నాటికి అందజేయాలని ఆదేశించారు. ప్రగతి తక్కువగా ఉన్న మండలాల్లో పర్యటించి వాస్తవ పరిస్థితులను గుర్తించాలని హౌసింగ్ పిడిని కలెక్టర్ ఆదేశించారు. ఫేజ్-3 ఇళ్ల నిర్మాణాల కాంట్రాక్టర్లతో హౌసింగ్ ఎఈ, డిఈ లతో కలిసి ఇళ్ల నిర్మాణాలు చేపట్టి నూరుశాతం పూర్తిచేయడంపై చర్యలు తీసుకోవాలన్నారు.

సమావేశంలో హౌసింగ్ పిడి డి. సత్యనారాయణ, జిల్లాలోని పలువురు డిఈలు, ఏఈలు, హాజరయ్యారు.

యోగాంధ్రలో బ్యాంకర్స్, లీడ్ బ్యాంకు ఉద్యోగులు, సిబ్బంది

విశాలాంధ్ర-ఏలూరు: యోగాంధ్రలో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు రీజనల్ మేనేజరు శ్రీదేవి,బ్యాంకర్స్,లీడ్ బ్యాంకు ఉద్యోగులు, సిబ్బంది సుమారు 90 మంది పాల్గొన్నా రని లీడ్ బ్యాంకు మేనేజరు డి.నీలాద్రి తెలి

పారు. యోగాంధ్ర మాస వేడుకలలో భాగంగా మంగళవారం స్థానిక వట్లూరు టిటిడిసిలో నిర్వహించిన యోగాభ్యాసన కార్యక్రమంలో పాల్గొని యోగా అభ్యాసనాలు చేశారు. ఈ సందర్భంగా లీడ్ బ్యాంకు మేనేజరు డి.నీలాద్రి మాట్లాడుతూ ప్రస్తుత జీవితంలో ఉరుకుల పరుగుల వలన వ్యాయామం చేయడమే మర్చిపోతున్నా మన్నారు. ప్రతిరోజు కొంత సమయం కేటాయించి యోగా ఆసనాలు చేసుకుని ఇతరులకు ఆదర్శంగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు అధికారులు,లీడ్ బ్యాంకు,బ్యాంకు ఉద్యోగులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వెన్నుపోటు దినం వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-టి నరసాపురం: కొయ్యలగూడెంలో బుధవారం జరిగే నియోజకవర్గస్థాయి వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్ఆర్‌సిపి మండల కన్వీనర్

శ్రీనురాజు పిలుపునిచ్చారు. టి నరసాపురంలో దేవరపల్లి ముత్తయ్య నివాసం వద్ద వెన్నుపోటు దినం వాల్‌పోస్టర్‌ను వైసీపీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనురాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రాష్ట్రంలో అరాచకాలకు, అన్యాయాలకు అడ్డు అదుపు లేకుండా పోయిం దని అన్నారు. అక్రమ అరెస్టులతో వేధిస్తూ, భయభ్రాంతులకు చేస్తున్నారని విమర్శించారు. ఎన్నికల హామీలు అమలు చేయ కుండా ప్రజలను మోసగించారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా రైతు విభాగం అధ్యక్షులు వాసిరెడ్డి మధు, ఎంపిటిసిలు నార్లపాటి వెంకటేశ్వరరావు, అర్జా బాలయ్య, నాయకులు కాల్నీడి సుబ్బారావు, కటకం మల్లికార్జునరావు, మాదంశెట్టి మల్లయ్య, కాల్నీడి జగన్, పెద్దబాబు, ఆచంట కుటుంబరావు, ఓబిలనేని నాగేశ్వరరావు, సాయల సత్యనారా యణ తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర-2047పై చిత్రలేఖనం పోటీలు

విశాలాంధ్ర -భీమవరం: శాఖా గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు "స్వర్ణాంధ్ర-2047" అనే అంశంపై చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు పులఖండం కోటేశ్వరరావు మాట్లాడుతూ వేసవి విజ్ఞాన తరగతులు విద్యార్థులకు ఎంతో

ఉపకరిస్తున్నాయని అన్నారు. ఈ తరగతులకు తల్లిదండ్రులు పిల్లలను శ్రద్ధగా పంపిస్తున్నారని అభినందించారు. విద్యార్థులను సెల్ ఫోన్, టీ.వీ.లకు వీలైనంత వరకు దూరంగా ఉంచాలని, పాఠ్యాంశాలను ఎప్పటికప్పుడు మననం చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రోగ్రాం కన్వీనర్ అల్లు శ్రీనివాస్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర- 2047 అంశంపై నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారని, వేసవి శిక్షణా తరగతుల్లో గెలుపొందిన విజేతలకు జూన్ ఆరవ తేదీన బహుమతులు అందిస్తామని తెలిపారు. అనంతరం బాల బాలికలకు స్నాక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎస్.వెంకటేశ్వరరావు, ట్రైనర్ ఎం.డి.సరోజ, సిబ్బంది, చదువరులు పాల్గొన్నారు.

వృద్ధులు, విభిన్నప్రతిభావంతులకు ఇంటివద్దకే రేషన్

ఏలూరులో పలుచోట్ల రేషన్ పంపిణీని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర -ఏలూరు: ఏలూరు నగరంలో పలు ప్రదేశాలలో వృద్ధులు, విభిన్నప్రతిభావంతులకు ఇళ్ళకు వెళ్లి రేషన్ పంపిణీని మంగళవారం జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఏలూరు నగరంలోని 23వ డివిజన్ ఫిరంగులదిబ్బలో 83 సంవత్సరాల కె. నాగమ్మ, 80 సంవత్సరాల ఎ. సుబ్బలక్ష్మి, 66 సంవత్సరాల ఆర్. మహాలక్ష్మి ఇళ్ల వద్ద రేషన్ షాపు డీలర్ రేషన్ పంపిణీ చేస్తుండగా కలెక్టర్ వెట్రిసెల్వి ఆకస్మికంగా తనిఖీ చేసి, రేషన్‌ను కలెక్టర్ స్వయంగా లబ్దిదారులకు అందించారు. రేషన్ పంపిణీ పట్ల వారి అభిప్రాయాన్ని అడిగి తెలుసుకున్నారు. రేషన్ పంపిణీ చేస్తున్న సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తున్నారా లేదా అనే విషయాన్ని పరిశీలించి, లబ్దిదారులను కూడా అడిగి తెలుసుకున్నారు. రేషన్ పంపిణీ విధానం పట్ల వారు సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ 65 సంవత్సరాలు పైబడిన వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులు, మంచానికి పరిమితమైన వారికి బియ్యం, పంచదార వంటి రేషన్ సరుకులను కార్డుదారుల ఇంటివద్దకే రేషన్ షాపు సిబ్బంది వచ్చి అందిస్తారని కలెక్టర్

చెప్పారు. ప్రతీ రేషన్ షాపు పరిధిలో 65 సంవత్సరాలపైన వయస్సు కలిగిన వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులు, మంచానికి పరిమితమైన వారి వివరాలు సంబంధిత రేషన్ షాప్ డీలర్ల వద్ద ఉన్నాయని, వారందరికీ వారి ఇంటివద్దే రేషన్ సరుకులు అందిస్తారన్నారు. రేషన్ సరుకుల పంపిణీలో ఎలాంటి సమస్య ఉన్న కమాండ్ కంట్రోల్ సెంటర్ టోల్ ఫ్రీ నెంబర్ 18004256453 నెంబర్ కు కాల్ చేయాలని కలెక్టర్ వెట్రిసెల్వి సూచించారు. ఆర్డీఓ అచ్యుత్ అంబరీష్, తహసీల్దార్ శేషగిరిరావు, స్థానిక ప్రముఖులు రామకృష్ణ, ప్రభృతులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

విశాలాంధ్ర- తాడేపల్లిగూడెం: కొండ్రుపోలు భగత్ సింగ్ కాలనీకి చెందిన దుర్గారావు కుమారుడు గంజ శ్రీనివాస్ రైలు ప్రమాదంలో ఇటీవల మరణించాడు. శ్రీనివాస్ కుటుంబ సభ్యులను భగత్ సింగ్ కాలనీ జనసేన పార్టీ ఇన్‌చార్జి కర్రి సురేష్ స్థానిక శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ వద్దకు తీసుకువెళ్లి సహాయం కోరారు. స్పందించిన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ తక్షణ సహాయంగా రూ.25 వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో కర్రి సురేష్, వర్తనపల్లి కాశి, అడపా ప్రసాద్, టి. గురుమూర్తి, పైబోయిన వెంకట్రావు, వెంకటేష్, శ్రీను, రవి తదితరులు పాల్గొన్నారు.

పరిశీలించిన కలెక్టర్

(1వ పేజీ తరువాయి)

లాలాచెరువు, దివాన్ చెరువు గ్రామాల్లోని చౌక దుకాణాల పరిధిలోని అర్హులైన వృద్ధులు, దివ్యాంగులకు ఇళ్ల వద్దకే రేషన్ సరుకులు పంపిణీ అంశాన్ని కలెక్టర్ ప్రశాంతి ఆకస్మికంగా సందర్శించారు. దీనిలో భాగంగా రేషన్ సరుకులు సక్రమంగా అందించారా లేదా అన్న విషయాన్ని వృద్ధులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ రేషన్ పంపిణీ నెలలో 15 రోజుల పాటు అందుబాటులో ఉంటుందని తెలిపారు.

బాధ్యత

(1వ పేజీ తరువాయి)

నేరమన్నారు. ఈ చట్టాన్ని సమర్థవంతం గా అమలు చేయడంలో డివిజన్ స్థాయిలో పోలీసు, రెవిన్యూ శాఖలను సమన్వయం చేసుకొని కార్మిక వ్యవస్థ ముందుకు వెళ్లడం ద్వారా సత్ఫలితాలు ఉంటాయని తెలిపారు. పెళ్లిళ్ల సీజన్‌లో బాల్యవివాహాలను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె..రత్నప్రసాద్ మాట్లాడుతూ నిషేధిత ప్రమాదకర వృత్తులలో పని చేయించుకోవడం లేక పనిలోకి అనుమతించడం పూర్తిగా నిషేధమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఉప కార్మిక కమిషనరు పి. శ్రీనివాస్, అసిస్టెంట్ కార్మిక కమిషనరు జి.నాగేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఎం. సుబ్బారావు, సోషల్ వెల్ఫేర్ జెడి ఎం. ముక్కంటి, డిఎంహెచ్ఓ డాక్టర్ ఆర్. మాలిని, ఐసిడిఎస్ పిడి. పి. శారద, డిసిపిఓ డాక్టర్ సిహెచ్ సూర్యచక్రవేణి, పలువురు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

విడనాడాలి

(1వ పేజీ తరువాయి)

వ్యవహరించారని పేర్కొన్నారు. కార్మికులకు సిఎల్‌లు అమలు చేయడం లేదని, వారు సకాలంలో విధులకు హాజరు కావడం లేదనే సాకుతో కార్మికులకు పూర్తిస్థాయిలో జీతాలు వేయకుండా సగం జీతమే వేస్తున్నారని తెలిపారు. దీనిని కార్మికులు ప్రశ్నించగా మరలా బిల్లులు పెడతామని చెప్పారని, ఆ బిల్లులు ఎప్పటికి వస్తాయో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిరిగి తిరిగి కార్మికుల కాళ్ళు అరిగిపోతున్నాయని అన్నారు. తొలుత 14వ సర్కిల్ వద్ద నిరసనలు చేసి అనంతరం నగరపాలక సంస్థ మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టి అడిషనల్ కమిషనర్‌కు సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు జనిపల్లి అప్పన్న, లక్ష్మణ్, మున్నా, శ్రీను, అప్పన్న, సభ్యులు పాల్గొన్నారు.

ఎండ తీవ్రతతో అల్లాడుతున్న ప్రజలు

విశాలాంధ్ర-లింగపాలెం: కొద్ది రోజుల నుంచి ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో మెట్ట ప్రాంత ప్రజలు అల్లాడుతున్నారు. ఋతుపవనాలు వచ్చేశాయని ముందుగా ప్రకటించటం ఆ తరువాత ఇవి రావటానికి సమయం పడుతుందని శాస్త్రవేత్తలు చెప్పు తుండటంతో ప్రజల్లో నిరాశ అలముకుంది. లింగపాలెం మండలంలో కొద్ది రోజులు విపరీతమైన

ఎండలు వేస్తున్నాయి. ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. ఎండలతో పాటు ఉక్కపోత తీవ్రంగా ఉంది. ఫ్యాన్లు నుంచి వచ్చే వేడిగాలితో వీటి కింద ఉంటున్న వారు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉపాధి పనులకు వెళ్లే కూలీల పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. ఉదయం 7 గంటలకే ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో పనులు చేయలేకపోతున్నారు. వయసు పైబడిన వారంతా పనులు చేయలేక సేద తీర్చుకునే పరిస్థితి నెలకొంది. మెట్ట ప్రాంతంలో మేలో ఎండ ప్రభావం అంతగా కనిపించనప్పటికీ జూన్ ప్రారంభమైనప్పటి నుంచి ఎండఅధికంగా ఉంది. ఎండల వల్ల అనేకమంది వ్యాధుల బారిన పడుతున్నారు. అధికారులు,ఉద్యోగులు కార్యాలయాల్లో వేడికి ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వ్యవసాయ పనులు ప్రారంభించేందుకు సిద్ధమవుతున్న రైతులకు ఎండలు నిరాశ కలిగిస్తున్నాయని వాపోతున్నారు. వర్షాలు పడితే ఈ పరిస్థితి నుంచి ఉపశమనం పొందవచ్చని ప్రజలు ఆశపడుతున్నారు.

ఆశా కార్యకర్తల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర- భీమవరం టౌన్ : :నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్ హెచ్ ఎం) పథకంలో పశ్చిమ గోదావరి జిల్లాలో రూరల్, అర్బన్ ఏరియాలలో 65 మంది ఆశ కార్యకర్తల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు డిఎంహెచ్ఓ డాక్టర్ గీతా బాయ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారు ఈనెల 10వ తేదీలోగా ఖాళీలు వున్న గ్రామ పంచాయతీ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాల్సిం దిగా ఆమె తెలిపారు. గ్రామీణ ఆరోగ్య పారిశుధ్య పౌష్టికాహార కమిటీ (వి హెచ్ ఎస్ ఎన్ సి) ద్వారా వచ్చిన దరఖాస్తుల నుండి అర్హత, ప్రతిభ కలిగిన 3 అప్లికేషన్‌ను సంబంధిత వైద్యాధికారి ద్వారా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయానికి పంపించాలి. ప్రతిభ ఆధారంగా డిస్ట్రిక్ట్ హెల్త్ సొసైటీ (డిహెచ్ఎస్) ద్వారా నియామకాలు జరుగుతాయని తెలిపారు.

మద్ది అంజన్నకు ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం రూరల్ : మండలంలోని గురవాయిగూడెం గ్రామంలో మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో ఆలయ అర్చకులు స్వామివారికి ప్రభాతసేవ, నిత్యార్చన పూజలు నిర్వహించారు. స్వామివారికి ప్రీతికరమైన మంగళవారం కావడంతో

పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయంవద్ద గల మజ్జిగ చలివేంద్రం వద్ద పలువురు భక్తులు దాహార్తి తీర్చుకొన్నారు. మధ్యాహ్నం వరకు దేవాలయానికి వివిధ సేవల, విరాళాల ద్వారా రూ. 2,23,162 ఆదాయం సమకూరిందని, సుమారు 2,000 మంది భక్తులకు స్వామివారి నిత్యాన్నదాన సత్రంలో అన్నప్రసాద వితరణ చేసినట్లు దేవస్థాన కార్యనిర్వాహణాధి కారిణి ఆర్.వి. చందన తెలిపారు.

మతిస్థిమితం లేక వృద్ధుడి మృతి

విశాలాంధ్ర-లింగపాలెం : కె.గోకవరంలో గ్రామానికి దూరంగా ఉన్న చెట్లలో మృతిచెందిన వృద్ధుడి మృతదేహాన్ని కనుగొని ధర్మాజీగూడెం పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ధర్మాజీగూడెం ఎస్సై వెంకన్న బాబు తమ సిబ్బందితో సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. ద్వారకా తిరుమలకు చెందిన చవటపల్లి రాము(61) కొంతకాలం నుంచి మతిస్థిమితం లేకుండా తిరుగుతూ అనారోగ్యానికి గురయ్యాడని మృతుని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన కుమార్తె గద్దేవారిగూడెంలో ఉండటంతో అక్కడకు బయలుదేరి మతి స్థిమితం లేకపోవటంవల్ల మార్గం తెలియక ఈ ప్రాంతంలోచెట్ల మధ్యలో పడుకుని మృత్యు బారిన పడి ఉంటాడని తెలిపారు. ఆరు రోజుల క్రితం ఈ సంఘటన జరిగి ఉంటుందని అనుమానిస్తున్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన సమాచారంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కష్టించినా ఫలితం శూన్యం

వేతనాలు అందక ఉపాధి కూలీల అగచాట్లు

విశాలాంధ్ర-పెంటపాడు : ఏప్రిల్ నెల నుండి ఇప్పటివరకు పనిచేసిన కూలీలకు వేతనాల అందక తీవ్ర అవస్థలు పడుతున్నారు. తక్షణమే ప్రభుత్వం ఉపాధి కూలీలకు వారి వారి ఖాతాలలో జమ చేయాలని వ్యవసాయ

కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కళింగ లక్ష్మణరావు కోరారు. మంగళవారం పెంటపాడు మండలం ఆకుతీగపాడు, ముదునూరు గ్రామాల్లో ఉపాధి కూలీలతో వారు పనిచేసే ప్రదేశాల్లో ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పని ప్రదేశంలో పనికి తగిన వేతనాలు తక్షణమే ఇవ్వాలని కూలీలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. వారిని ఉద్దేశించి లక్ష్మణరావు మాట్లాడుతూ ఏప్రిల్, మే ప్రస్తుతం జూన్ నెల లో పనిచేస్తున్నారని ఇప్పటివరకు ఒక పైసా కూడా కూలీలకు అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యవసర వస్తువుల ధరలు కొనుగోలు చేయడానికి డబ్బులు లేక అధిక వడ్డీలకు అప్పులు తెచ్చుకొని జీవనం కొనసాగిస్తున్నారని ఆయన వివరించారు. అప్పులు తీర్చుకోలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని అన్నారు. ఈ సమస్యను పరిష్కారం చేయని పక్షంలో జిల్లా వ్యాప్తంగా కూలీలతో నిరసన చేపడుతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వంక అప్పారావు, వంక రామకృష్ణ, ములగల శ్రీనివాస్, చిన్నం రాజు ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

బాలికలు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

విశాలాంధ్ర- పాలకోడేరు : ఆకివీడు ఐసిడిఎస్ ప్రాజెక్టు సిబ్బంది ఆధ్వర్యంలో జరుగుతున్న కిషోర్ వికాసం కార్యక్రమం పాలకోడేరులో ఐసిడిఎస్ సిపిడిఓ వాణి విజయరత్న అధ్యక్షతన

మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనాడు ప్రపంచ స్థాయిలో పురుషులతోపాటు స్త్రీలు కూడా సమానంగా ఉన్నత స్థాయిలో కీలక అంశాలలో పోటీ పడుతున్నారన్నారు. దానికి అనుగుణంగా చిన్నప్పటినుండి బాలికలు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని తెలిపారు. మహిళ సాధికారత సాధించాలని అన్నారు. డి సి పి ఓ రాజేష్ మాట్లాడుతూ బాలికలు చదువు పై అత్యంత శ్రద్ధ వహించి జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ పార్వతి, జిఎంఎస్ కె లలిత, అంగన్వాడి వర్కర్స్ విమల, రమణ, శాంత కుమారి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

విశాలాంధ్ర-టి నరసాపురం: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని జంగారెడ్డిగూడెం ఆర్టీఓ మదన్ ఆలీ అన్నారు. టి నరసాపురంలో రహదారి భద్రతపై వాహనదారులకు మంగళవారం అవగాహన

కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని అన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు వాహనాలు ఇవ్వరాదని హితవు పలికారు. ఆటో డ్రైవర్లు ఇరువైపులా ప్యాసింజర్లను కూర్చోబెట్టుకుని ప్రయాణం చేయరాదని, మద్యం సేవించి వాహనం నడపడం నేరమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఎస్ఎస్ రంగ నాయకులు, వెహికల్ ఇన్స్పెక్టర్ వై.సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

కోడూరు రహదారి సొగసు చూడతరమా!

- 3 కి.మీ రహదారి పొడవున గుంతలే
- భారీ వాహనాలతో ఛిద్రమై కోతకు గురైన మార్జిన్లు

విశాలాంధ్ర-ముదినేపల్లి : ఆర్ అండ్ బి ప్రధాన రహదారి తారు రోడ్డుగా నిర్మాణం జరిగింది. నిర్మాణం జరిగిన మరుసటి రోజు నుండి చేపల చెరువులకు మేతతో ట్రాన్స్ పోర్ట్ భారీ వాహనాల రాకపోకలతో రహదారి నామరూపాలు కోల్పోయింది. ధనార్జన ధ్యేయంగా టన్నుల బరువు లారీలు వెళ్లడంతో ఈ పరిస్థితి నెలకొంది.

ముదినేపల్లి మండలం కోడూరు గ్రామపంచాయతీకి ప్రధాన రహదారి నుండి కోడూరు వెళ్ళాల్సిన ఆర్ అండ్ బి రహదారిపై ప్రయాణం నరకప్రా యంగా మారింది. గ్రామం నుండి గుడివాడ-ముదినేపల్లి వెళ్లాలంటే 3కి.మీ దాటి వెళ్ళాలి. బస్సు సౌకర్యం లేదు. విద్యార్థులు, మహిళలు , గ్రామస్తులు ఏదైనా వాహనం ఉంటేనే ప్రయాణం. రహదారిపై ప్రయాణం చేయడమంటే సాహస యాత్రే అడుగడుగున గోతులు, రహదారి రెండు వైపులా కందకాలు, వర్షం పడితే చెరువులే. రహ దారిపై ప్రయాణం చేస్తున్న వాహనదారులు పల్టీ కొడుతున్నారు. ప్రజా ప్రతినిధులు పట్టించుకోరు. అధికారులు కన్నెత్తి చూడరు. మండలంలో ఇలాంటి రహదారి మరొకటి ఉండదు. ఈదుస్థితిని పట్టించుకునే వారు లేరు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి రహదారిని పూర్తిస్థాయిలో నిర్మాణం జరిగేలా టెండర్లు పిలవాలని సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఏలూరు డిపో సిఐ దురుసు ప్రవర్తనకు నిరసన

విశాలాంధ్ర-ఏలూరు: ఆంధ్రప్రదేశ్ ప్రజా రవాణా శాఖ ఏలూరు డిపో ఎంప్లాయీస్ యూనియన్ కార్యదర్శి ఆంజనేయులుపై సీఐ దురుసు ప్రవర్తనకు నిరసనగా డిపో గ్యారేజ్ వద్ద గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో డిపో గౌరవాధ్యక్షులు టి.శ్రీని వాస్ మాట్లాడుతూ డిపో యూనియన్ కార్యదర్శి పట్ల సిఐ వ్యవహరించిన విధానం సరైనది కాదన్నారు.

సూపర్వైజర్లు, ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులను చిన్నచూపు చూస్తున్నా రని, వాహనాల కండిషన్ మెరుగుపరచాలని పదేపదే తెలియజేసినా ఏ మాత్రం మెరుగు పరచలేదని విమర్శించారు. డిపోలో మౌలిక సదుపాయాలు అంతంత మాత్రమే ఉన్నాయని, వీటిని మెరుగుపర చాల్సిన అవసరం ఉందని తెలిపారు. డిపో సెక్రటరీ డి.ఆంజనేయులు మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు పోరాటం కొనసాగు తుంద న్నారు. గేట్ మీటింగ్‌లో యూనియన్ నాయ కులు వి.ఎస్.నారాయణ, ఎండి రాజేష్, పి.కె.బి.రాజు, పి. శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాదుకు ఆర్టీసీ సర్వీసు

విశాలాంధ్ర - ఆగిరిపల్లి: ఆగిరిపల్లి బస్టాండ్ నుండి వయా నూజివీడు ఖమ్మం మీదుగా హైదరాబాదు బిహెచ్ఇఎల్ వరకు ఆర్టీసీ బస్సును నడపనున్నట్లు నూజివీడు ఆర్టీసీ డిపో మేనేజర్ పవన్ తెలిపారు. ప్రతిరోజు రాత్రి 8 గంటల 20 నిమిషాలకు సర్వీస్ నెంబర్ 4033 బయలుదేరు తుందన్నారు. తిరిగి హైదరాబాద్

బిహెచ్ఇఎల్ నుండి ఆగిరిపల్లి వరకు ప్రతిరోజు రాత్రి 8 గంటల 30 నిమిషాలకు హైదరాబాద్ బీహెచ్ఈఎల్ బస్టాండ్ వద్ద సర్వీస్ నెంబర్ 40301 బస్సు సౌకర్యం ఉందని తెలిపారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచు కోవాలని,ఆర్టీసీ ప్రయాణం సురక్షితమైనదని డిపో మేనేజర్ తెలిపారు.

వేసవి విజ్ఞాన తరగతులను వినియోగించుకోవాలి

విశాలాంధ్ర-టి నరసాపురం: విద్యార్థులు వేసవి విజ్ఞాన తరగతులను వినియోగించు కోవాలని గ్రంథాలయ పాలకులు ఆర్. కిషోర్ తెలిపారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా మంగళవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా

ఆయన మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిక్షణా తరగతుల్లో విద్యార్థులకు కథలు, కథనాలు, సృజనాత్మకత కృత్యాలతో పాటు వివిధ అంశాల్లో శిక్షణ ఇస్తున్నట్టు ఆయన తెలిపారు. గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, విద్యార్థులు బాల్యం నుంచే పుస్తక పఠనం అలవరచుకొని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

మల్లులను పరామర్శించిన గోపాలన్

విశాలాంధ్ర -భీమవరం: అరసం జిల్లా సమితి సభ్యురాలు, న్యాయవాది మల్లుల అనురాధ మృతి పట్ల సీపీఎం జిల్లా కార్యదర్శి జె.ఎన్.వి. గోపాలన్, జిల్లా సెక్రటేరియట్ సభ్యులు బి.వాసుదేవరావు సంతాపాన్ని తెలియజేశారు. భార్యా వియోగంతో బాధపడుతున్న మల్లుల శ్రీనివాసరావును సీపీఎం నాయకులు మంగళవారం రాయలంలోని వారి గృహంలో కలిసి పరామర్శించారు. ఆమె చిత్రపటానికి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతిని తెలియజేశారు. చిన్న వయసులోనే అనురాధ మృతి చెందడం వారి కుటుంబానికే కాక అభ్యుదయ రచయితల సంఘానికి, ప్రజా ఉద్యమాలకు తీరనిలోటని వారు అన్నారు.

ఆర్థిక సంఘ నిధుల కోసం పంచాయతీల ఎదురుచూపు

విశాలాంధ్ర-లింగపాలెం: ఆర్థిక సంఘ ప్రణాళిక నిధుల కోసం పంచాయతీలు ఎదురుచూస్తున్నాయి. పంచాయతీలకు ఆర్థిక సంఘ నిధులు రాకపోవటంతో పంచాయతీలలో మేజర్ పనులు చేసేందుకు వీలులేని పరిస్థితి ఏర్పడిందని పాలకులు వాపోతున్నారు. లింగపాలెం మండలంలో 22 పంచాయతీలు ఉన్నాయి. గత ఏడాది నవంబర్లో 2024 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి లింగపాలెం మండలంలోని పంచాయతీలకు రూ. 2.48 కోట్లు విడుదల చేశారు. 2025 సంవత్సర కాలానికి సంబంధించి ఇంకా నిధులు విడుదల కాలేదు. మార్చి నెలలోనే ఈ నిధులు రావాల్సి ఉండగా ఇప్పటివరకు రాకపోవటంతో పంచాయతీ పాలకులు నిరుత్సా హంతో ఉన్నారు. ఈ నిధులు పంచాయతీలకు కేటాయిస్తేనే ముఖ్యమైన పనులు చేయటానికి అవకాశం ఉంటుంది. ఈ నిధులు విడుదల చేస్తే గ్రామాలలో అనేక పనులు చేసేందుకు పాలకులు పంచాయతీ సిబ్బంది ప్రణాళికతో సిద్ధంగా ఉన్నారు. చేసిన కొన్ని పనులకు నిధులు రాకపోవడంతో ఇబ్బందులు పడు తున్నారు. పంచాయతీలలో ఇంటి, కుళాయి పన్నులకు సంబంధించి ఆదాయం వస్తున్నా ఇవి నామమాత్రంగా ఉండటంతో వీటితో చిన్న,చిన్న పనులు చేసేందుకే వీలు కలుగుతుందని ముఖ్యమైన పనులు చేసేం దుకు అవకాశం లేకుండా ఉందని పాలకులు వాపోతున్నారు. ఆర్థిక సంఘ నిధులే కాకుండా స్టాంపు డ్యూటీలకు సంబంధించి పంచాయతీలకు రావలసిన వాటా నిధులు మూడేళ్లుగా రాకపోవడంతో పాలకులు ఆవే దన వ్యక్తం చేస్తున్నారు. ఈ నిధులకు సంబం ధించి లింగపాలెం మండలంలోని పంచాయతీ లకు దాదాపు రూ.50 లక్షలు రావల్సి ఉంది. ఏళ్ల గడుస్తున్నా స్టాంపు డ్యూటీ నిధులను మాత్రం పంచాయతీలకు కేటాయించడం లేదు. ఈ నిధులు వస్తేనే పంచాయతీలలో అభివృద్ధి పనులు చేసేందుకు వీలు కలుగుతుంది. మండలంలోని పంచాయతీలన్నీ గ్రామీణ ప్రాంతాలు కావడంతో ఆదాయ వనరులు తక్కువగా ఉంటాయి. దీనివల్ల అనుకున్న అభివృద్ధి జరిగేందుకు ఆటంకం కలుగు తుంది. ఆర్థిక సంఘం నిధులు, స్టాంపు డ్యూటీ నిధులతో పాటు ప్రత్యేక నిధులు ఉంటేనే గ్రామాలలో అభివృద్ధి పనులు జరుగుతాయి. ప్రభుత్వాలు ఈ పరిస్థితుల గమనించి నిధులు విడుదల చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లింగపాలెం మండల పరిషత్ కార్యాలయానికి సంబంధించి 2024,2025 సంవత్సర కాలానికి ఆర్థిక సంఘం నిధులు రూ 24 లక్షలు రావల్సి ఉంది. నెలలు గడుస్తున్న నిధులు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ఈ నిధులు రాకపోవడంతో మూడు నెలలుగా కాంట్రాక్టు పద్ధతిలో ఉద్యోగాలు చేస్తున్న వారికి జీతాలు అందించ లేకపోతున్నారు. మండల పరిషత్ కార్యాలయంలో అధికారిక సమావేశాలు నిర్వహిస్తే సమావేశాల్లో పాల్గొన్న వారికి కనీస సౌక ర్యాలు కల్పించలేని పరిస్థితి నెలకొంది. మండల పరిషత్ కార్యాలయానికి రూ 1.75లక్షల విద్యుత్తు బకాయిలు చెల్లించాల్సి ఉంది.స్టాంప్ డ్యూటీ నిధులు కూడా మండల పరిషత్‌కు రావడం లేదు. నిధులు లేని లింగపాలెం మండల పరిషత్ కార్యాలయంలో అనేక పనులు పెండింగ్ పడుతున్నాయి. ఉన్నతా ధికారులు జోక్యం చేసుకొని మండల పరిషత్‌కు పంచాయతీలకు నిధులు విడుదలయ్యేలా చర్యలు తీసుకోవాలని పాలకులు, ప్రజలు, సిబ్బంది కోరుతున్నారు.

పామాయిల్ రైతుల సమస్యలు పరిష్కరించాలి

కలెక్టర్‌కు వినతి పత్రం అందజేత

విశాలాంధ్ర -చింతలపూడి: పామాయిల్ రైతుల సమస్యలు పరిష్కరించాలని పి జి ఆర్ ఎస్ కార్యక్రమంలో కలెక్టర్‌కు రైతు సంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఏలూరు జిల్లా అధ్యక్షులు పుల్లారి సోమశేఖర్, పామాయిల్ సంక్షేమ సంఘం అధ్యక్షులు రామరాజు, పామాయిల్ రైతులు కాశీ కృష్ణ , కారుమూడి రమేష్, అలవాల శంకర్ రెడ్డి , రైతులు తదితరులు పాల్గొన్నారు.

అబ్బుర పరుస్తున్న రక్త కలువ పుష్పం

విశాలాంధ్ర -ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల మండలం తిమ్మాపురంలో ఓ ఇంటి గోడపై ఏర్పాటు చేసిన పూల కుండీలో పూసిన బ్లడ్ ఫ్లవర్(రక్త కలువ పువ్వు) అబ్బుర పరుస్తున్నది. గ్రామానికి చెందిన పోలిన శ్రీనివాసరావు తన ఇంటి గోడపై పూల కుండీలో ఈ మొక్కను నాటారు. ప్రస్తుతం ఆ మొక్క నుంచి పూసిన పువ్వు ఎంతో ఆకర్షణీయంగా ఉంది. ఈ పుష్పం మే నెలలో మాత్రమే పూస్తుందని, ఈ ఏరియాలో ఇది కనిపించడం అరుదు అని స్థానికులు ఆసక్తిగా తిలకిస్తున్నారు. ఇది అలంకార మొక్కగానే కాకుండా వివిధ రోగాల నివారణకు మందుగా కూడా ఉపయోగపడుతుందని స్థానిక ఉద్యానశాఖాధికారి దేవదానం తెలిపారు. సెనెగల్, సోమాలియ, దక్షిణాఫ్రికా, భారతదేశంలోని ద్వీపకల్పంలో కూడా ఇది కనిపిస్తుందని చెప్పారు.

దుర్గా లక్ష్మణేశ్వరస్వామి ఆలయ చైర్మన్‌గా బాబూరావు

విశాలాంధ్ర - నరసాపురం: మండలంలోని లక్ష్మణేశ్వరం గ్రామంలో వేంచేసి వున్న దుర్గాలక్ష్మణేశ్వర స్వామి దేవస్థానం నూతన చైర్మన్‌గా టీడీపీ నాయకుడు వెన్నా బాబూరావును కూటమి ప్రభుత్వం నియమించింది.ఈ సందర్భంగా ఆయన సోమవారం అడ్వైజర్ గవర్నమెంట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (మైనార్టీ అఫైర్స్) సభ్యుడు ఎం ఏ షరీఫ్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజును మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా బాబూరావుకు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ కొప్పాడ రవీంద్రనాథ్ ఠాగూర్, కోలపర్తి శివ, మావూరి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సేవలు విస్తృతం చేయాలి

కలెక్టర్ వెట్రిసెల్వి

విశాలాంధ్ర-ఏలూరు: ప్రస్తుతం రెడ్‌క్రాస్ వద్దవున్న రెండు డయాలసిస్ మిషన్లకు అదనంగా మరో రెండు డయాలసిస్ మిషన్లతో డయాలసిస్ సెంటర్‌ను త్వరగా ప్రారంభించే ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి రెడ్‌క్రాస్ కార్యవర్గానికి సూచించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఏలూరు జిల్లా శాఖ చైర్మన్ డాక్టర్ ఎంబీవీస్ ప్రసాద్, కమిటీ సభ్యులు మంగళవారం కలెక్టర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రెసిడెంట్ కె. వెట్రి సెల్విని మర్యాదపూర్వకంగా కలిసి రెడ్ క్రాస్ నిర్వహిస్తున్న కార్యక్రమాల పై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ వాయ్ హాన్ కాఫీ లిమిటెడ్ వారు అందిస్తామన్న మరో రెండు మిషన్లతో రక్త యూనిట్ల నిల్వలను పెంచి రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంకు కేంద్రంలో నాణ్యమైన, సురక్షితమైన రక్తాన్ని అవసరమైన ప్రజలకు అందించేలా కృషి చేయాలన్నారు. జిల్లా రెడ్ క్రాస్ సొసైటీని సేవా కార్యక్రమాలలో ప్రథమ స్థానంలో ఉండేలా కమిటీ సభ్యులు అందరూ సమిష్టిగా కృషి చేయాలని, అందుకు అవసరమైన సహకారాన్ని అందిస్తామన్నారు. ఈ సందర్భంగా ఏలూరు శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య(చంటి) మాట్లాడుతూ రెడ్ క్రాస్ సేవా కార్యక్రమాలను జిల్లాలోని ప్రజలకు అందించే విషయంలో ఏలూరు నియోజకవర్గం తరపున తన పూర్తి సహకారం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ చైర్మన్ డాక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్,

వృద్ధాశ్రమం, తెర్షియరి కేర్ సెంటర్,యోగ సెంటర్, చనిపోయిన వ్యక్తులకు ఉపయోగించే ఫ్రీజర్ బాక్సులు వంటి సేవ కార్యక్రమాలను దాతల సహకారంతో దశలవారీగా ఏర్పాటు చేయడం కోసం ఒక ఎకరం స్థలంను రెడ్ క్రాస్ సొసైటీకి కేటాయించాలని కోరగా ఈ విషయాన్ని పరిశీలిస్తామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ జె.సత్యనారాయణరాజు, ట్రెజరర్ ఎన్.బ్రహ్మానందం, ఆడిటర్ జి.శ్రీకాంత్, కార్యదర్శి బి. బెన్నీ,కమిటీ సభ్యులు ఆలపాటి నాగేశ్వరరావు, ఎం.చంద్రశేఖర్ మేతర అజయ్ బాబు, ఎంవివి నాగేశ్వరరావు, కే. శ్రీనివాస్, ఎం.మురళీకృష్ణ, పి.శ్రీరామరాజు బి.లక్ష్మీనారాయణ,తదితరులు పాల్గొన్నారు.

వెన్నుపోటును పేటెంట్‌గా తీసుకున్న జగన్

ఎమ్మెల్యే బడేటి విమర్శ

విశాలాంధ్ర ప్రతినిధి -ఏలూరు : వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి వెన్నెపోటును పేటెంట్‌గా తీసుకున్నారని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి విమర్శించారు.

సొంత చెల్లికి, తల్లికి వెన్నుపోటు పొడిచిన జగన్మోహన్ రెడ్డి ఇప్పుడు వెన్నుపోటు దినం నిర్వహించడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. ఏలూరులో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి పాలనపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గతంలో రాజారెడ్డి తన గనుల్లో ఉపాధి కల్పించిన వెంకట నర్సయ్యకు వెన్నుపోటు పొడిచారని, జగన్ తన కన్నతల్లికి, సొంత చెల్లికి ఆస్తి కోసం వెన్నుపోటు పొడిచారని మండిపడ్డారు. చివరకు ఐదేళ్ళు అధికారం ఇచ్చిన ప్రజలకు సైతం జగన్ వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. తొలి ఏడాదిలో కూటమి ప్రభుత్వం 70 శాతం హామీలను అమలు చేయడం చూసి ఓర్వలేక ప్రజల దృష్టిని మళ్ళించడానికి ధర్నాల డ్రామా ఆడుతున్నారని ధ్వజమెత్తారు. 16,347

పోస్టులతో డిఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి శ్రీకారం చుట్టామని గుర్తుచేశారు. రాష్ట్రంలో రోడ్లపై గుంతలు పూడ్చే కార్యక్రమం పూర్తిచేశామని, 1200 కోట్ల రూపాయలతో 20 వేల కిలోమీటర్ల రోడ్లు బాగు చేసినట్లు తెలిపారు.

సీపీఐ మండల కార్యదర్శిగా చోడెం దుర్గ

విశాలాంధ్ర - బుట్టాయిగూడెం: సీపీఐ బుట్టాయిగూడెం మండల కార్యదర్శిగా చోడెం దుర్గను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య తెలిపారు. కమిటీ నూతన కార్యవర్గాన్ని సోమవారం జరిగిన సీపీఐ మండల సమితి 14వ మహాసభలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కృష్ణ చైతన్య ప్రకటించారు. సీపీఐ మండల కార్యదర్శిగా చోడెం దుర్గ, సహాయ కార్యదర్శులుగా ఉయికే చంద్రం, బేతి కిశోర్, కమిటీ సభ్యులుగా చోడెం గణేశ్, కురసం సూర్యచంద్రం, మడకం దుర్గారావు, బుద్దుల ముత్యాలమ్మ, తెల్లం మునీశ్వరరావు, తెల్లం వీరమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

టీడీపీ పట్టణ అధ్యక్షులుగా అప్పారావు

విశాలాంధ్ర- చింతలపూడి: చింతలపూడి టీడీపీ పట్టణ అధ్యక్షులుగా తాటి అప్పారావు నియమితులయ్యారు. స్థానిక శాసనసభ్యులు సొంగ రోషన్ కుమార్ తనను నియమించి నట్లు తాటి అప్పారావు తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు ఇచ్చిన పదవికి న్యాయం చేస్తానని, కార్యకర్తలకు అందుబాటులో ఉంటానన్నారు. ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా పార్టీకి అంకితభావంతో పని చేస్తానని ఆయన అన్నారు. ఈ పదవిని అప్పగించినందుకు శాసనసభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

చదువు మూడో నేత్రం

విశాలాంధ్ర - గణపవరం: బాల బాలికలు చదువుకోవడం వల్ల జ్ఞానం పెరిగి మంచి భవిష్యత్ ఏర్పడి ఉన్నత స్థాయికి ఎదుగుతారని చదువు మూడో నేత్రమని ఐసిడిఎస్ గణపవరం సెక్టర్ సూపర్వైజర్ పి. తులసి అన్నారు. మంగళవారం కిశోరి వికాసం, కౌమార బాలికల నాయకత్వం, సాధికారత గురించి గణపవరం-4 సచివాలయంలో బాలికలు, బాలురకు వివరించారు. బాగా చదువుకోవటం వలన ధైర్యంగా ఏ పనినైనా సాధించగలమని తద్వారా అందరికి ఆదర్శంగా నిలబడగలమని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌కె లక్ష్మి నరసమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు, కిశోరి బాలికలు, బాలురు పాల్గొన్నారు. మండలంలో పిప్పర సెక్టర్ సూపర్వైజర్ సిహెచ్ దుర్గాభవాని ఆధ్వర్యంలో పిప్పర గ్రామంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సోషల్ వర్కర్, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

దివ్యాంగులు, వృద్ధులకు ఇంటి వద్దనే రేషన్

విశాలాంధ్ర-టి.నరసాపురం: దివ్యాంగులు,వృద్ధులకు ఇంటి వద్దనే రేషన్ ఇవ్వనున్నట్లు జంగారెడ్డిగూడెం ఆర్డీఓ ఎంవివి రమణ తెలిపారు. మంగళవారం ఆమె మండల కేంద్రంలోని రేషన్ షాపులను తనిఖీ చేసి రేషన్ పంపిణీ చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. అనంతరం మెట్టగూడెంలోని వృద్ధులు అనగాని చిట్టమ్మ,కాసగాని కనకదుర్గ ల ఇంటికి వెళ్లి రేషన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా షాపుల వద్దనే రేషన్ పంపిణీ విధానాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. ప్రతి నెల ఒకటో తేదీ నుండి 15వ తేదీ వరకు సరుకులు పంపిణీ చేస్తారని ఆమె తెలిపారు. దివ్యాంగులకు, వృద్ధులకు స్వయంగా రేషన్ డీలర్లు ఇంటికి తీసుకువెళ్లి రేషన్ అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ టి.సాయిబాబా, సీనియర్ అసిస్టెంట్ హరిబాబు, వీఆర్వో పణి కుమార్, డీలర్ నందికొండ అఖిల,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటండి- ప్రకృతిని కాపాడండి

విశాలాంధ్ర-ఏలూరు: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 5న జిల్లా వ్యాప్తంగా 4.50 లక్షల మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టనున్నట్లు కలెక్టర్ కె. వెట్రిసెల్వి తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ నుంచి ప్రపంచ పర్యావరణ దినోత్సవం రోజున మొక్కలు నాటే కార్యక్రమంపై వివిధ శాఖల జిల్లా అధికారులు, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఓలు, తహసీల్దార్లు, ఈఓపిఆర్‌డిఓ అధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ఈనెల 5వ తేదీన పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఒకేరోజు రాష్ట్రవ్యాప్తంగా కోటి మొక్కలు నాటే బృహత్తర కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి

శ్రీకారం చుట్టారని తెలిపారు. ఏలూరు జిల్లావ్యాప్తంగా 4.50 లక్షల మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్ట మన్నారు. జిల్లాలోని 27 మండలాల్లో ఆయా శాఖల వారీగా మొక్కలు నాటే లక్ష్యాన్ని నిర్దేశించినట్లు తెలిపారు. జెడ్పి ఆధ్వర్యంలో 74,790, డ్వామా ఆధ్వర్యంలో 60,750, డిఆర్‌డిఏ ఆధ్వర్యంలో 54,000, డిపివో ఆధ్వర్యంలో 33,750, ఐసిడిఎస్ ఆధ్వర్యంలో 33,750, విద్యాశాఖ ఆధ్వర్యంలో 27,000, మెప్మా ఆధ్వర్యంలో 25,000, హౌసింగ్ ఆధ్వర్యంలో 27,000, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో 18,900, ఐటీడీఏ ఆధ్వర్యంలో 17,500, ఇలా మొత్తం 27 శాఖల ఆధ్వర్యంలో జూన్ 5వతేదీన 4.50 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా తీసుకున్నామన్నారు. సమీప నర్సరీల నుండి మొక్కలను తీసుకుని జూన్ 5వ తేదీన నాటేందుకు సిద్ధం కావాలని అధికారులను ఆదేశించారు. మొక్కలు నాటేందుకు అవసరమైన గుంతలు, ట్రీ గార్డ్స్ సిద్ధం చేసుకోవాలన్నారు. మొక్కలు నాటే కార్యక్రమంలో ప్రజలను ప్రధాన భాగస్వాములుగా చేయాలన్నారు. మొక్కలను నాటడంతోపాటు, వాటి పరిరక్షణకు కూడా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

వైసీపీ, టీడీపీ దొందు..దొందే

విశాలాంధ్ర - సామర్లకోట : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి బుధవారం నాటికి సంవత్సరం కావడంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వెన్నుపోటు దినంగా నిర్వహిస్తున్నట్లు ప్రకటించింది. కూటమి ప్రభుత్వం వైసీపీ ప్రభుత్వం పోయి నేటికీ ఏడాది కావడంతో పీడ విరగడైన దినంగా ప్రకటించుకున్నాయి. ఈ సంవత్సర కాలంలోను, గత ప్రభుత్వంలోనూ ప్రజ లకు ఒరగబెట్టింది ఏమీ లేకపోవడం గమనార్హం. సూపర్ సిక్స్ వంటి హామీలు ప్రజలకు ఇచ్చి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నుండి సంక్షేమ పథకాలు అమలు చేయకపోగా అభివృద్ధి మాటలకే పరిమితమైంది. గత ప్రభుత్వ హయాంలో సంక్షేమం పుల్లుగా అమలు చేసి అభివృద్ధి మరిచింది. కూటమి ప్రభుత్వం సూపర్ 6 వంటి హామీలు ఇచ్చి ప్రజా పాలన చేయడం మరచి ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడం, కక్ష సాధింపులు చేసుకోవడం తప్ప ప్రజలకు చేసింది ఏమీ కనబడడం లేదు. గత ప్రభుత్వ హయాంలో పరిపాలన వికేంద్రీకరణకు సచివాలయాలు ఏర్పాటు చేసి అనేక మందికి ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించి సచివాలయాల ద్వారా వాలంటరీ వ్యవస్థను ఏర్పాటు చేసి ఇంటింటికి తిరుగుతూ అమ్మ ఒడి, విద్యా దీవన, నివాస స్థలాలు, వంటి అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రజలకు చేరువయ్యే ప్రయత్నం చేశారు. అభివృద్ధి లేకపోవడం తదితర కారణాలతో వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించారు.

కూటమి ప్రభుత్వం వలంటరీ వ్యవస్థను తొలగించడం, ఉచిత గ్యాస్ మినహా ఒక్క సంక్షేమ పథకాన్ని కూడా అమలు చేయకపోవడం ఎంతసేపు అభివృద్ధి అనే మాటలు తప్ప అభివృద్ధి ఎక్కడ కనిపించకపోవడంతో ఇప్పటి ప్రభుత్వంపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఇప్పటికైనా సంక్షేమ పథకాలు అమలు చేసి యువతకు ఉద్యోగ కల్పన చేసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రయత్నించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

కళ్లకు గంతలు కట్టుకుని కార్మికుల నిరసన

విశాలాంధ్ర - సామర్లకోట : సామర్లకోట మున్సిపాలిటీ ఇంజనీరింగ్ ఔట్సోర్సింగ్ కార్మికులు సామర్లకోట మున్సిపల్ కార్యాలయం ఎదురుగా కళ్లకు గంతలు కట్టుకుని మంగళవారం నిరసన తెలియ జేశారు. గత 28 రోజుల నుండి సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వంలో ఏ విధమైన కదలిక లేకపోవడం దారుణమని అన్నారు. టెక్నికల్ వర్కర్లకు రూ.29,000 నాన్ టెక్నికల్ వర్కర్లకు రూ.24 వేల జీతాలు ఇవ్వాలని, ఆదివారం జాతీయ సెలవు రోజు కూడా జీతాలు చెల్లించాలని, కార్మికులను పర్మినెంట్ చేయాలని, విధి నిర్వహణలో కార్మికులు మరణిస్తే కుటుంబానికి రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. న్యాయమైన కోరికలను వెంటనే ఆమోదించి సమస్యను పరిష్కరించాలని కార్మికులు కోరుతున్నారు.

5 నుంచి తిరు కళ్యాణ మహోత్సవాలు

విశాలాంధ్ర - మామిడికుదురు : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ స్వామివారి కళ్యాణ మహోత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. శ్రీదేవి భూదేవిలతో జరిగే శ్రీవారి దివ్య కళ్యాణాన్ని సుమారు 300 మంది భక్త దంపతులు కళ్యాణ క్రతువులో పాల్గొనేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వీరికి స్వామి వారి ప్రతిమతో పాటు శేష వస్త్రాలు అందజేస్తారు. టీటీడీ నుంచి స్వామివారికి పట్టు వస్త్రాలు అందజేయనున్నారు. ఉత్సవాలను తిలకించేందుకు విచ్చేసే భక్తులకు నిత్య అన్నదాన సత్రములో భోజనాలు సమకూర్చేందుకు ఏర్పాట్లు చేశారు.

ఉత్సవాలకు సకల ఏర్పాట్లు : ఐదు రోజుల పాటు జరిగే ఉత్సవాలు తిలకించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ సహాయ కమిషనర్ ఎం. సత్యనారాయణరాజు తెలిపారు. భక్తులకు ఉచిత భోజన సదుపాయంతో పాటు ప్రత్యేక ప్రసాదాన్ని సిద్ధం చేసినట్లు తెలిపారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు వసతి సదుపాయం కల్పించామన్నారు.

తహశీల్దార్ ప్రసాద్‌కు ఘన సన్మానం

విశాలాంధ్ర - రాజోలు : రాజోలు తహశీల్దార్‌గా పనిచేసి పదవీవిరమణ చేసిన ఎన్ఎస్ఎస్ ప్రసాద్‌కు రాజోలు రెవిన్యూ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘన సత్కారం జరిగింది. శివకోటి మంగెన గంగయ్య తెలగా కళ్యాణ మండలంలో రాష్ట్ర రెవిన్యూ జెఏసి చైర్మన్ వివిఎస్ దివాకర్ అధ్యక్షతన మంగళవారం జరిగిన సన్మాన సభకు రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ప్రతిక్షణం సేవ చేసే అవకాశం రెవిన్యూ వ్యవస్థలోనే ఉంటుందని అన్నారు. ప్రసాద్ రాజోలు తహశీల్దారుగా తక్కువ కాలంలోనే ఉన్నత అధికారులు, ప్రజల మన్ననలు పొందారని అన్నారు. మరొక ముఖ్య అతిథి అమలాపురం ఆర్డీఓ మాధవీ లత మాట్లాడుతూ ప్రసాద్ విధి నిర్వహణలో అంకిత భావంతో పని చేశారని అన్నారు. అనంతరం ప్రసాద్ దంపతులను శాలువాలు పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ స్పీకర్ ఏవీ సూర్యనారాయణ రాజు, సోషల్ వర్కర్ యాలింగ్ రమేష్, రాజోలు సర్పంచ్ నక్కా రామారావు, ఆయా మండలాల తహశీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది, ప్రజా ప్రతి నిధులు, రేషన్ డీలర్స్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నారా లోకేష్‌కు ధూళిపూడి కృతజ్ఞతలు

విశాలాంధ్ర - తాళ్లరేవు : తుని రైలు దహనం కేసు కొట్టి వేస్తూ రైల్వే కోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై అప్పీల్‌కు వెళ్లే ఆలోచన లేదని స్పష్టం చేసిన నారా లోకేష్‌కు, ప్రభుత్వానికి ధూళిపూడి కృతజ్ఞతలు తెలిపారు. కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం పి మల్లవరంలో ధూళిపూడి వెంకటరమణ (బాబి) విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేసుపై ఆర్పీఎఫ్ సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ చేసిన ప్రతిపాదనల ఆధారంగా ఉత్తర్వులు వెలువడినట్లు గుర్తించిన అధికారులు, ఇటువంటి సున్నితమైన అంశం వలన కూటమి ప్రభుత్వానికి అండగా నిలిచిన కాపు సంఘాల మనోభావాలు దెబ్బతినే అవకాశం ఉన్నందున మంత్రి నారా లోకేష్ చొరవ చూపినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు యోగ తరగతులు

విశాలాంధ్ర - కాకినాడ : పౌర గ్రంథాలయ శాఖా సంచాలకుల వారి ఆదేశములు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఉత్తర్వుల ప్రకారం జిల్లా కేంద్ర గ్రంథాలయం, కాకినాడలో మంగళవారం వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా విద్యార్థిని, విద్యార్థులకు యోగ తరగతులు నిర్వహించారు. యోగ శిక్షణ నిపుణులు గిడ్ల సత్యవతి యోగాసనాలు, యోగా వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు, విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థిని, విద్యార్థులచే ఉదయం 8 గంటల నుండి 8:30 గంటల వరకు పుస్తక పఠనం నిర్వహించారు. 8:30 గం.ల నుండి 9:30 గం.ల వరకు డీఆర్‌డీపీ శిక్షణా నిపుణులు వి సత్య బాల విద్యార్థులకు నీతి కథలు బోధించడం, కమ్యూనికేషన్స్ స్కిల్స్ పై శిక్షణ ఇచ్చారు. 9:30 నుండి 10:30 వరకు యోగా శిక్షణ నిపుణులు గిడ్ల సత్యవతి విద్యార్థులకు యోగా తరగతులు నిర్వహించారు. 10:40 గంటల నుండి 11:30 గంటల వరకు విశ్రాంత ఉపాధ్యాయులు సూర్య నారాయణ విద్యార్థులకు ఓరిగామి మరియు పేపర్ క్రాఫ్ట్ పై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పాలంకి నాగరాజు, జిల్లా కేంద్ర గ్రంథాలయ ఉప గ్రంథాలయ అధికారి ఇన్‌ఛార్జి కిషోర్, జిల్లా కేంద్ర గ్రంథాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్ జగన్మోహనరెడ్డి

విశాలాంధ్ర - కాకినాడ రూరల్ : వెన్నుపోటు, గొడ్డలివేటుకు పేటెంట్ దారుడైన జగన్మోహనరెడ్డి ధర్నాలకు పిలుపునివ్వడం హాస్యాస్పదంగా ఉందని పార్టీ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే 'పిల్లి' దంపతులు ధ్వజమెత్తారు. వలసపాకలలోని తమ నివాసం వద్ద టీడీపీ కో ఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంత లక్ష్మి దంపతులు వైసీపీ నేతలు చేపట్టిన వెన్నుపోటు ధర్నాను ఉద్దేశించి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జగన్ రెడ్డి తన ఉనికిని చాటుకునేందుకు అబద్ధపు ధర్నాలు చేపడుతున్నాడని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే కూటమి ప్రభుత్వం 70శాతం హామీలు నెరవేర్చిందన్నారు. గత ఐదేళ్ల పాలనలో ఆంధ్ర రాష్ట్ర ప్రజలను వెన్నుపోటు పొడిచిన జగన్ ప్రభుత్వంలో తొలి ఏడాదిలో 10శాతం హామీలను కూడా అమలుచేయలేదని ఐదేళ్లల్లో 85శాతం హామీలకు జగన్ సర్కార్ ఎగనామం పెట్టిందన్నారు. మెగా డీఎస్సీ హామీపై మాట తప్పి యువతకు వెన్నుపోటు పొడిచిందన్నారు. అన్నక్యాంటీన్లు రద్దు చేసి పేదలను, కార్మికులను వెన్నుపోటు పొడిచింది జగన్మోహనరెడ్డి అన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ సబ్ ప్లాన్ నిధులు లక్ష కోట్లు దారి మళ్లించి సామాజిక న్యాయానికి వెన్నుపోటు పొడిచింది వాస్తవం కాదా జగన్ రెడ్డి అని ప్రశ్నించారు. మత్స్యకారుల ఉపాధిని దెబ్బతీసే 217 జీవో రద్దు చేశామని, మత్స్యకారులకు రూ.20 వేల ఆర్థిక సాయం కింద రూ.259 కోట్లు ఇప్పటికే అందజేశామన్నారు. వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్ జగన్ కుంభకోణాల నుంచి ప్రజా దృష్టి మళ్లించడానికే ధర్నాల డ్రామా ఆడుతున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు కాళ్ళ శ్రీనివాస్, పంపన బుజ్జి, దాసరి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

గోదావరి మృతుల కుటుంబాలకు సీఎం ఆర్థిక సహాయం

విశాలాంధ్ర - కాట్రేనికోన : కమినిలంక వద్ద ఇటీవల గోదావరిలో మునిగి 8 మంది యువకులు మృతి చెందిన సంఘటనలో ముఖ్య మంత్రి ప్రకటించిన ఆర్థిక సహాయం మంజూరైంది. చెయ్యేరులో జరిగిన ప్రజా వేదికలో ఒక్కో బాధిత కుటుంబానికి రెండు లక్షల రూపాయలు చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. ఐ పోలవరం మండలం జి మూలపోలం ఎర్రగరువు గ్రామానికి చెందిన వడ్డి మహేష్(16), వడ్డి రాజేష్(14) అన్నదమ్ములు మృతిచెందగా బాధిత కుటుంబానికి ఒక్కొక్కరికి 2 లక్షల రూపాయలు చొప్పున 4 లక్షల రుపాయల చెక్కులను మంగళవారం ప్రభుత్వ విప్, ముమ్మిడివరం శాసన సభ్యులు దాట్ల సుబ్బరాజు అందచేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇటువంటి సంఘటన జరగడం దురదృష్టకరం అన్నారు. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యదర్శి నాగిడి నాగేశ్వరరావు, మత్స్యకార నాయకులు బొమ్మిడి లింగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

6న గజమాల యాత్ర విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - రాజోలు : మామిడి కుదురు మండలం అప్పనపల్లి శ్రీబాలబాలాజీ స్వామి ఆలయ నిర్మాత మొల్లేటి రామస్వామి-ఆదిలక్ష్మి దంపతులకు జూన్ ఆరో తేదీన కళ్యాణోత్సవాల్లో భాగంగా సమర్పించే గజమాల యాత్ర విజయవంతం చేయాలని రాజోలు తాలూకా శెట్టిబలిజ సంక్షేమ సంఘం పిలుపునిచ్చింది. మంగళవారం తాటిపాకలోని రాజోలు తాలూకా శెట్టిబలిజ సంక్షేమ సంఘం భవనంలో తాలూకా సంఘం అధ్యక్షుడు దొమ్మేటి ఉమామహేశ్వరరావు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గజమాలయాత్రకు సంబంధించి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తాలూకా సంఘ సభ్యులు చెల్లిబోయిన శ్రీనివాస్, గుబ్బల రమేష్, గుబ్బల శ్రీనివాస్, కాండ్రేగుల సత్యనారాయణ, గుబ్బల బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రపాలెంలో కల్వర్టులు పునర్నిర్మాణం చేయాలి

విశాలాంధ్ర - కాకినాడ రూరల్ : కాకినాడ రూరల్ ఇంద్రపాలెం గ్రామంలో కల్వర్టులు పునఃనిర్మాణం చేయాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేసి గ్రామ పరిపాలన అధికారి శివ ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఇంద్రపాలెం గ్రామ డివైఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు ఎ. రవితేజ, సిహెచ్. సాహిత్ మాట్లాడుతూ గ్రామంలో కల్వర్టులు, అస్తవ్యస్తంగా ఉన్న రోడ్లతో గ్రామ ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలుగుతుందన్నారు. కల్వర్టులు బాగా ఎత్తుగా నిర్మించడంతో వాహనాలు, కల్వర్టులపైన ఎటు కదలకుండా ఆగిపోతున్నాయని, గ్రామ ప్రజలు ప్రమాదాల పాలవుతున్నారని తెలిపారు. అనేక ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని, తక్షణమే గ్రామంలో ఉన్న అన్ని కల్వర్టులు పునఃనిర్మాణం చేయాలని డివైఎఫ్ఐ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ ఉపాధ్యక్షులు దివాకర్, సహాయ కార్యదర్శి వాసుదేవ్, సీనియర్ నాయకులు విజయ్ కుమార్ పాల్గొన్నారు.

హెల్మెట్ వాడకంపై అవగాహన

విశాలాంధ్ర - కాకినాడ : హెల్మెట్ వాడకం, నెంబరు ప్లేట్ల అమరిక, సైబర్ నేరాలపై ట్రాఫిక్ పోలీసులు ప్రజలకు అవగాహన కల్పించారు. మంగళవారం కాకినాడ బాలాజీ చెరువు సెంటరులో కాకినాడ ట్రాఫిక్ -1 పోలీసులు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో మోటార్ వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ ప్రభుత్వం జారీ చేసిన నంబర్ ప్లేట్లను మాత్రమే వాడాలని సూచించారు. మోటార్ సైకిల్స్ నడిపే ప్రతి ఒక్కరు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని, ట్రిపుల్ రైడింగ్, బైక్ స్టంట్స్, మైనర్ డ్రైవింగ్ చేయరాదని, తెలిపారు. రాష్ అండ్ నెగ్లిజెన్స్‌గా డ్రైవ్ చేయరాదని, మాడిఫైడ్ సైలెన్సర్లు వాడరాదని, సెల్ ఫోన్లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయొద్దని, ట్రాఫిక్ రూల్స్ తప్పని సరిగా పాటించాలని కోరారు. కొత్త చట్టం ప్రకారం తప్పు చేసిన వాహన దారులకు భారీ జరిమానాలు విధిస్తామని తెలిపారు. ఆన్లైన్ మోసాలు, ఫేక్ లోన్స్ మోసాలు, ఆన్లైన్ జాబ్సవర్క్స్ తదితర అంశాలపై పోలీసులు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్-1 ఇన్‌స్పెక్టర్ రమేష్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధులకు, దివ్యాంగులకు ఇంటి వద్దకే రేషన్

విశాలాంధ్ర - కడియం : రేషన్ సరుకుల పంపిణీలో అక్రమాలకు తావు ఉండకూడదనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం జూన్ 1వ తేదీ నుండి రేషన్ షాపులను పునః ప్రారంభించింది. దీనిలో భాగంగా 65 సంవత్సరములు దాటిన వృద్ధులకు, వికలాంగులకు మాత్రం ఇంటి వద్దనే రేషన్ సరుకులు ఇచ్చేలా నిబంధన పెట్టింది. 65 సంవత్సరాల పైబడిన వృద్ధులకు వికలాంగులకు ఇంటి వద్దనే రేషన్ సరుకుల డెలివరీ సక్రమంగా జరుగుతున్నదీ లేనిదీ తెలుసుకోవడానికి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజా రమేష్ ప్రేమ్ కుమార్ కడియం మండలం వేమగిరి గ్రామంలోని రేషన్ షాప్ నెంబర్ 18, 19, 33 షాపులను మంగళవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కడియం మండల రేషన్ షాపు డీలర్ల అధ్యక్షులు గడ్డం పృథ్వీరాజ్, రేషన్ షాపు డీలర్ లు పాల్గొన్నారు.

తాడిపూడి ఓపెన్ రీచ్‌లో లారీ సీజ్

విశాలాంధ్ర -తాళ్లపూడి : స్టాక్ పాయింట్లకుఓపెన్ రీచ్‌ల నుంచి ఇసుక రవాణా కార్యకలాపాలు జూన్ ఒకటవ తేదీ నుంచి నిలుపుదల చేసినట్టు కొవ్వూరు రెవెన్యూ డివిజనల్ అధికారి రాణి సుస్మిత మంగళవారం ఒక ప్రకటనలో తెలియచేసారు. ఓపెన్ రీచ్‌లలో అక్టోబరు 15 వ తేదీ వరకు ఎటువంటి కార్యకలాపాలు నిర్వ హించరాదని, ఈ మేరకు మైన్స్ శాఖ కూడా ఓ పత్రికా ప్రకటన విడుదల చేసింది. ఈ క్రమంలోనే తాళ్లపూడి మండలం తాడిపూడి ఓపెన్ రీచ్ నుండి నిబంధనలు పాటించ కుండా ఇసుకను రవాణా చేస్తున్న ఒక లారీని సీజ్ చేసి , కేసు నమోదు చేశారు. సంబంధిత ఓపెన్ రీచ్ పాయింట్ ఏజెన్సీ వారికి నోటీసు జారీ చేసామని ఆర్డీవో తెలియ చేశారు. కలెక్టర్ అదేశాల మేరకు లారీని తన సిబ్బందితో వెళ్లి సీజ్ చేసినట్లు తాళ్లపూడి ఇన్‌చార్జి తహసీల్దార్ భారతి తెలిపారు.

50 ఏళ్లు దాటిన వారికి పెన్షన్ సదుపాయం కల్పించాలి

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, బీసీలకు 50 సంవత్సరాలు దాటిన వారికి పెన్షన్ సదుపాయం కల్పిస్తామని హామీ ఇచ్చిందని, ఇప్పటి వరకు అమలు చేయలేదని, వెంటనే అమలు చేయాలని పిసిసి సభ్యులు ధరణాలకోట శ్రీను ఆధ్వ ర్యంలో ప్రత్తిపాడు ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్ బాబుకు వినతిపత్రం అందజేశారు. 60 సంవత్సరాలు పైబడిన వారు, దివ్యాంగులు, వితంతువులకు అర్హులైన వారందరికీ పెన్షన్ సదుపాయం కల్పించాలని మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో దాసరి సత్తిబాబు, కోన సూరిబాబు ,కోటిపల్లి సూరిబాబు, గంగుమళ్ళ సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

సన్‌ఫీస్ట్ మామ్స్ మ్యాజిక్ 'షైన్స్'ను విడుదల చేసిన ఐటీసీ

విశాలాంధ్ర-రాజమండ్రి: ప్రముఖ ఫుడ్ విభాగ ఉత్పత్తుల సంస్థ ఐటీసీ సన్‌ఫీస్ట్ మామ్స్ మ్యాజిక్, తమ మామ్స్ మ్యాజిక్ షైన్స్ షైనీ బటర్ (వెన్న) కుకీని విడుదల చేసింది. ఇది బటర్ కుకీ ప్రియులకు ఆనందకరమైన కొత్త అనుభవాన్ని అందిస్తామనే వాగ్దానం చేస్తోంది. ఒక తల్లి తన బిడ్డలో ప్రతిభను బయటకు తీసుకువచ్చినట్లే, ఈ కరకరలాడే , వెన్నతో కూడిన కుకీని సున్నితమైన చక్కెర గ్లేజింగ్ ద్వారా ప్రత్యేకంగా తయారు చేశారు. ఇది కుకీ యొక్క మెరుపును సజీవంగా తెస్తుంది. దీని కోసం, మామ్స్ మ్యాజిక్ నదియా మొయిదుతో ప్రత్యేకంగా తీర్చిదిద్దిన కొత్త టీవీసీ ని విడుదల చేసింది, ఇది దాని తాజా ఆవిష్కరణ గురించి వెల్లడిస్తుంది. రుచి, ఆకృతిని పెంచే ప్రత్యేకమైన మెరిసే చక్కెర గ్లేజింగ్‌తో రూపొందించిన ఈ కుకీలో నోరూరించే వెన్న నింపారు. కుకీ కొరికిన ప్రతిసారీ సంతృప్తికరమైన రుచిని అందిస్తుంది. దీనిలోని కరకరలాడే ఎనిమిది పొరలు ఒక ప్రత్యేకమైన, నోటిలో కరిగిపోయే అనుభవాన్ని సృష్టిస్తాయి, అసమానమైన ట్రీట్‌గా మారుస్తాయి. రోజువారీ స్నాక్స్ అనుభవాన్ని షైన్స్ మెరుగుపరుస్తుంది, ఇది పగటిపూట తినడానికి , టీ-టైమ్ క్షణాలను ఆస్వాదించటానికి సరైన అనుబంధంగా మారుస్తుంది.

మామ్స్ మ్యాజిక్ ఒక టీవీసీని విడుదల చేసింది, ఇది తన బిడ్డ ఎదుగుదలలో ఒక తల్లి తిరుగులేని మద్దతు సారాంశాన్ని అందంగా ఒడిసిపడుతుంది. ఈ చిత్రంలో నదియా మొయిదు ఒక తల్లి పాత్రను పోషించారు. ఆమె క్రంచీ బటర్ కుకీపై సున్నితమైన చక్కెర గ్లేజింగ్‌ను వర్తింపజేయడం వల్ల దానిలోని మెరుపు ఎలా బయటపడుతుందో అందముగా తెలియజేస్తారు. అదేవిధంగా, చెన్నైలో చెస్ శిక్షణ పొందాలనే తన కుమార్తె కలను నెరవేర్చడానికి మద్దతు ఇవ్వడం , దానికోసం తమ మామగారిని సున్నితంగా ఒప్పించడం, తద్వారా ఆమె తన బిడ్డ సామర్థ్యాన్ని వెలికి తీసుకురావటానికి కృషి చేయటం దీనిలో కనిపిస్తుంది. తమ పిల్లలలోని ఉత్తమతను బయటకు తీసుకురావడానికి అదనపు కృషి చేసే తల్లులకు ఈ టీవీసీ ఉపయోగపడుతుందని, ఆవిష్కరణ సందర్భంగా ఐటీసీ లిమిటెడ్ బిస్కెట్స్ అండ్ కేక్స్ క్లస్టర్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ అలీ హారిస్ షేర్ తెలిపారు.

ధనార్జనే ధ్యేయంగా ప్రజలను దోచుకున్న జగన్

విశాలాంధ్ర - అమలాపురం : మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తన నాటకాలు కట్టి పెట్టాలని అమలాపురం ఎమ్మెల్యే అయితా బత్తుల ఆనందరావు అన్నారు. మంగళవారం డాక్టర్ మెట్ల సత్యనారాయణ రావు స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆనందరావు జగన్ మోహన్ రెడ్డి పై నిప్పులు చెరిగారు. జగన్మోహన్ రెడ్డి ఐదేళ్ల కాలంలో ప్రజలకు ఉపయోగపడే ఒక్క పని చేయకుండా ధనార్జన ధ్యేయంగా పనిచేసి అడ్డంగా దోచుకున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంక్షేమ పాలన అందిస్తుంటే చూసి ఓర్వలేక అవాకులు, చవాకులు పేలుతున్నాడని ఆనందరావు విమర్శించారు. ప్రజలు అవకాశం ఇస్తారన్న భ్రమతో జీవిస్తున్నాడని అన్నారు. ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించాడని విమర్శించారు. సమావేశంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అల్లాడి స్వామి నాయుడు, బొర్రా ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పరీక్షల్లో ఫెయిలయ్యా... తనువు చాలిస్తున్నా...

- మనస్తాపంతో భావి ఇంజనీర్ బలవన్మరణం
- సూసైడ్ నోట్ స్వాధీనం చేసుకున్న పోలీసులు

విశాలాంధ్ర - రాజానగరం : తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలంలోని నన్నయ వర్సిటీ సమీపం లోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థిని సోమవారం కళాశాల వసతి గృహంలో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. ఈ సంఘటనకు సంబంధించి రాజానగరం సీఐ ఎస్.ప్రసన్న వీరయ్య గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం నెల్లూరు జిల్లా నర్సాపురం మండలం గుడ్లూరు గ్రామానికి చెందిన పరుచూరి ప్రగతి (19) స్థానిక ఓ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ఫస్ట్ ఇయర్ చదువుతోంది. సెకండ్ సెమ్ తరగతులు సోమవారం నుంచి ప్రారంభం కావడంతో ఈ నెల 1వ తేదీన విద్యార్థిని స్వగ్రామం నుంచి కళాశాల వసతి గృహానికి చేరుకుంది. దుస్తులు ఆరబెట్టుకునే హుక్కుకు చున్నీని బిగించుకుని ఉరేసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. విగత జీవిగా ఉన్న ప్రగతిని చూసి వసతి గృహం అధికారులు పోలీసులకు సమాచారం అందించడంతో రాజానగరం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మొదటి సెమ్లో 4 పరీక్షల్లో ఫెయిల్ అయ్యానని, దీంతో మానసికంగా ఆందోళనకు లోనవుతూ, ఒంటరితనం ఫీలవుతున్నానని, తల్లిదండ్రులను జాగ్రత్తగా ఉండమని రాసి ఉన్న సూసైడ్ నోట్ సంఘటనా స్థలంలో లభ్యమైనట్లు పోలీసులు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎస్. ప్రసన్న వీరయ్యగౌడ్ తెలిపారు.

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి

విశాలాంధ్ర - సీతానగరం: యువత చెడు వ్యసనాలకు దూరంగా, క్రీడలకు దగ్గరగా ఉండాలని నా సేన- నా వంతు స్టేట్ కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి అన్నారు. మండలంలోని సీతానగరం గ్రామంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామ కృష్ణ అట్టహాసంగా ప్రారంభించిన సాయి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ గత కొద్ది రోజులుగా హోరా హోరిగా జరిగింది. మంగళవారం ఫైనల్ మ్యాచ్ రఘుదేవపురం, గాడల గ్రామాల టీమ్‌ల మధ్య జరిగింది. రఘుదేవపురం గెలిచి 50వేల రూపాయలు అందుకోగా గాడల రెండవ స్థానంలో నిలిచి 25వేల రూపాయలు, మూడవ స్థానంకు 10వేల రూపాయలు బహుమతిగా అందుకున్నారు. బత్తుల వెంకటలక్ష్మి బహుమతులు అందచేశారు. ఈ సందర్భంగా వెంకటలక్ష్మి మాట్లాడుతూ యువత ఎలాంటి చెడు వ్యసనాలకు లోనవకుండా ఉండేందుకు ఇలాంటి క్రీడా టోర్నమెంట్లు దోహదపడతాయన్నారు. టోర్నమెంట్ నిర్వహణకు రాజానగరం శాసన సభ్యులు తన వంతు ప్రోత్సాహంగా యువతలో ఉత్సాహం పెంచేందుకు పది వేల రూపాయలు విరాళంగా ఇవ్వడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, టోర్నమెంట్ నిర్వాహకులు, సహాయకులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

చిన్న మార్పుతో మలేరియా అంతం

విశాలాంధ్ర - రాజానగరం : ప్రజలందరిలో చిన్న మార్పు తీసుకురావడం ద్వారా మలేరియా అంతం చేయవచ్చని ప్రాథమిక ఆరోగ్య వైద్య కేంద్రం(పిహెచ్సీ) వైద్యులు డాక్టర్ జి.రామ్ భాస్కర్ అన్నారు. మలేరియా నివారణ మాసోత్సవాలను పురస్కరించుకొని మండల కేంద్రమైన రాజా నగరంలోని పిహెచ్సీలో మంగళవారం జరిగిన మలేరియా వ్యతిరేక దినోత్సవంలో పిహెచ్సీ వైద్యులు, సిబ్బంది, స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు. దీనిలో భాగంగా ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ జి.రామ్ భాస్కర్ మాట్లాడుతూ మలేరియా అంతం మనతోనే అనే నినాదంతో ఈ నెల1 నుండి జూన్ 30 వరకు మలేరియా వ్యతిరేక దినోత్సవ కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు.ప్రతి ఒక్కరు వ్యక్తిగతంగా పరిశుభ్రంగా ఉండడంతో పాటు పరిసరాలు కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పిహెచ్సీ వైద్యులు డాక్టర్ సి హెచ్ వెంకట లక్ష్మి, సిబ్బంది కృపాబాయ్, ఎన్ వి వి రమణ, మంగతాయారు, సతీష్, ఆశ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

వడిసలేరు వద్ద ప్రమాద ప్రాంతాన్ని పరిశీలించిన కలెక్టర్

విశాలాంధ్ర - రాజానగరం : వడిసలేరు వద్ద ప్రమాద ఘటనపై సమగ్ర నివేదిక అందజేయాలని కలెక్టర్ కె. వెట్రిసెల్వి ఆదేశించారు. మంగళవారం ఆమె ప్రమాద ఘటన స్థలాన్ని పరిశీలించారు. తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి అక్కడ వేగ నియంత్రణ, ప్రమాద హెచ్చరికల సూచికలు ఏర్పాటు చేయాలన్నారు.

ప్రమాద సమయంలో అందుబాటులో ఉన్న సీసీ టీవీ ఫుటేజ్ లను సేకరించి, వాటిపై విశ్లేషణ చేయాలని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడడానికి సమన్వయ శాఖల అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేయాలని కలెక్టర్ తెలియజేశారు. కలెక్టర్ వెంట ఆర్డీవో ఆర్. కృష్ణ నాయక్, జిల్లా రోడ్లు భవనాలు అధికారి ఎస్ బి వి రెడ్డి, డీఎస్పీ భవ్య కిషోర్, జిల్లా రవాణా అధికారి ఆర్. సురేష్, ఆర్డీసీ ఈఈ రవీంద్ర, రెవెన్యూ, పోలీసు ఇతర అధికారులు పాల్గొన్నారు.

పెన్‌కాక్ సిలాట్‌లో లిస్సీకి బంగారు పతకం

విశాలాంధ్ర-దేవరపల్లి: జూన్ 1న వైజాగ్‌లో నిర్వహించిన పెన్‌కాక్ సిలాట్ పోటీల్లో దేవరపల్లికి చెందిన కోణాల లిస్సీ అసాధారణ ప్రతిభను చూపించి బంగారు పతకాన్ని సాధించింది. లిస్సీ కఠిన శ్రమ, నిబద్ధత, క్రీడల పట్ల ఆమెకు ఉన్న ఆసక్తి వల్ల ఈ ఘనత సాధించగలిగింది. స్థానిక ప్రజాప్రతినిధులైన సుంకర దుర్గారావు లిస్సీని అభినందించారు. ఈ సందర్భంగా కోణాల లిస్సీ మాట్లాడుతూ ఈ విజయానికి మూల కారణం తనను ఎంతో ప్రోత్సహించిన తల్లిదండ్రులైన కోణాల సత్యనారాయణ, శైలజకు కృతజ్ఞతలు తెలిపింది. టీడీపీ సీనియర్ నాయకుడు, మండల తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షుడు సుంకర దుర్గారావు ఇంటి వద్ద లిస్సీని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించి దేవరపల్లి గ్రామానికి మంచి పేరు, ప్రతిష్టలు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎం. రాజేశ్వరి, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు ఇంటి వద్దకే రేషన్

విశాలాంధ్ర - అనపర్తి : గత వైసీపీ ప్రభుత్వంలో అస్తవ్యస్తమైన ప్రజా పంపిణీ వ్యవస్థను పట్టాలెక్కించడం, సమర్థవంతంగా నిర్వహించడం కోసం రేషన్ షాపు వ్యవస్థను మళ్ళీ తీసుకువచ్చినట్టు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. రేషన్ దుకాణాలు పునరుద్ధరణ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ చిత్ర పటాలకు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, కూటమి శ్రేణులు పాలాభిషేకం చేశారు. అనంతరం వృద్ధులు, వికలాంగుల ఇంటికి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి స్వయంగా వెళ్లి రేషన్ సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నల్లమిల్లి మాట్లాడుతూ వృద్ధులు, వికలాంగులు ఇతర శారీరక సమస్యలు కలిగిన వ్యక్తులకు ఇంటికే వెళ్లి రేషన్ సరుకులు అందించనున్నట్టు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు కొవ్వూరి శ్రీనివాసరెడ్డి (దత్తుడు శ్రీను), కర్రి వెంకటరామారెడ్డి, తహసీల్దార్ అనిల్ కుమార్, కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రమాద స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే నల్లమిల్లి

విశాలాంధ్ర - అనపర్తి : రంగంపేట మండలం వడిశలేరు ఏడిబి రోడ్డులో ఆగివున్న పాల ట్యాంకర్ ను వేగంగా వచ్చిన కారు ఢీకొన్న సంఘటనలో సోమవారం రాజమహేంద్రవరం రూరల్, రాజానగరం నియోజక వర్గానికి సంబంధించిన ఐదుగురు మృతి చెందారు. మంగళవారం అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణా రెడ్డి సంఘటన ప్రాంతానికి వెళ్లి ప్రమాదం జరిగిన తీరును పోలీస్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నల్లమిల్లి మాట్లాడుతూ అతివేగం ప్రమాదకరమని, వాహనదారులు ప్రయాణ భద్రత పాటించాలని విజ్ఞప్తి చేశారు. మృతులకు తమ ప్రగాఢ సంతాపం తెలిపి కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు, కార్యకర్తలు ఉన్నారు.

మత్స్యకారులతో యోగా సాధన

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : శారీరక, మానసిక ఉల్లాసానికి యోగా దోహదం చేస్తుందని, యోగాంధ్ర కార్యక్రమంలో మత్స్యకారులు పాల్గొనడం అభినందనీయమని జిల్లా సంయుక్త కలెక్టర్ ఎస్. చిన్న రాముడు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఆర్ట్స్ కళాశాల సమీపంలో గ్రాండ్ ట్రంక్ రోడ్డుపై మత్స్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో జేసీ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 25 రోజుల పాటు వివిధ రంగాల వారీగా యోగా సాధన కార్యక్రమం చేపట్టడం కోసం కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. అందులో భాగంగానే మంగళ వారం మత్స్యకారులతో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించినట్టు తెలిపారు. పెద్ద ఎత్తున మత్స్య కారులు భాగస్వామ్యం అవ్వడం అభినందనీయం అన్నారు. జూన్ 20 వ తేదీ వరకు వివిధ శాఖల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం కొనసాగుతుందని, 21 వ తేదీన అన్ని రంగాలను కలుపుకుని మెగా యోగా సాధన కార్యక్రమం చేపట్టనున్నట్టు తెలిపారు. ప్రజలందరూ ఇందులో భాగస్వాములు కావాలని కోరారు. యోగ గురువు కె ఎస్ వి శ్రీధర్ రెడ్డి నేతృత్వంలో ఎస్. అనంతలక్ష్మి యోగ సాధన చేయించారు. నిడదవోలు, దేవరపల్లి, రంగంపేట, కోరుకొండ, కొవ్వూరు, రాజానగరం, బిక్కవోలు, కడియం తదితర మండలాల నుంచి సుమారు 800 మంది మత్స్యకారులు, ఆక్వా రైతులు, లైసెన్స్ కలిగిన గోదావరి మత్స్యకారులు ఈ కార్యక్రమంలో పాల్గొని యోగా సాధన చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి టి. సీతారామమూర్తి, జిల్లా మత్స్యశాఖ అధికారి టి .నిర్మల కుమారి, జిల్లా వ్యాప్తంగా ఉన్న మత్స్య కారులు, వారి ప్రతినిధులు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్. మాధవరావు, మత్స్యశాఖ సహాయ సంచాలకులు దిల్షాద్, జిల్లా ఆయుష్ అధికారి కె. మోహన్, జిల్లా యోగాంధ్ర కన్వీనర్ పి. కాజియా, ఎఫ్ డి ఓ లు, మత్స్య శాఖ ఇన్స్పెక్టర్లు, సూపరింటెండెంట్, గ్రామ మత్స్య శాఖ సహాయకులు (వి ఎఫ్ ఏ) తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల రాష్ట్ర కౌన్సిల్ సమావేశం జయప్రదం చేయాలి

విశాలాంధ్ర - కడియం : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కౌన్సిల్ తృతీయ సమావేశం జూన్ 5 వ తేదీ గురువారం విజయవాడ ఎస్ కన్వెన్షన్ హాలులో జరుగుతుందని, ఈ కౌన్సిల్ సమావేశానికి ముఖ్య అతిథులుగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, నారా లోకేష్ హాజరుకానున్నారని వారితో పాటు వివిధ శాఖల మంత్రులు, రాష్ట్ర స్థాయి అధికారులు పాల్గొంటున్నారని సంఘ జిల్లా కార్యదర్శి సిహెచ్.ఎస్.విల్సన్ పాల్ తెలిపారు. కడియం పి.హెచ్.సి పరిధిలో పని చేస్తున్న ఉద్యోగులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు ఎదురుచూస్తున్న ఐఆర్, పీఆర్సి, డిఏ బకాయిలు మొదలగు వాటి గురించి, ఉద్యోగులు ఎదుర్కొంటున్న అపరిష్కృత సమస్యల గురించి సంఘ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.ఆర్. సూర్యనారాయణ, ఎం.రమేష్ కుమార్ లు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకురానున్నారని తెలిపారు. ఈ కౌన్సిల్ సమావేశానికి హాజరయ్యే ఉద్యోగులకు ఒకరోజు ప్రత్యేక సెలవును కూడా రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజమండ్రి రూరల్ తాలూకా యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.వి.ఎస్. రాజు, పి.మురళి కృష్ణ, కె.శ్రీనివాస రెడ్డి, వై.శాంతిరాజు, కె.ఎన్.మూర్తి, టి.మణి శ్రీ, వి.ఉమ తదితరులు పాల్గొన్నారు.

రైతులు విత్తన బిల్లును తప్పనిసరిగా తీసుకోవాలి

విశాలాంధ్ర - నిడదవోలు : నిడదవోలు మండలంలోని పలు విత్తన షాపులను కొవ్వూరు సహాయ వ్యవసాయ సంచాలకులు పి.చంద్రశేఖర్ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ రైతులు విత్తనాలు కొనేటప్పుడు నమూనాలను పరిశీలించి కేళీలు ఉన్న, లేదా మొలక శాతం 80% కంటే తక్కువగా ఉన్న విత్తనాలను రైతులు కొనుగోలు చేయరాదని, వాటి విషయమై వెంటనే వ్యవసాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. కొనుగోలు చేసిన విత్తన బిల్లును తప్పనిసరిగా తీసుకోవాలని తెలియజేశారు. నిడదవోలులోని డీసీఎంఎస్,శ్రీ సత్యనారాయణ రైస్ అండ్ జనరల్ స్టోర్స్,శ్రీ భాను చైతన్య సీడ్స్ లోని విత్తనాలు నిల్వలను పరిశీలించి రికార్డులతో సరిపోల్చి చూశారు. రైతులకు ఎంటియు13 18,పిఎల్ఎ1100,ఎంటియు 1064,ఎంటియు 1061, స్వర్ణ, సంపద స్వర్ణ మొదలైన విత్తనాలు అందుబాటులో ఉన్నాయని చంద్రశేఖర్ తెలిపారు. నిడదవోలు మండలంలో 419 క్వింటాళ్ల విత్తనాలు రైతులకు అందుబాటులో ఉన్నాయని, ఇప్పటివరకు 1175 క్వింటళ్ల విత్తనాలు రైతులు కొనుగోలు చేసారన్నారు. ఈ సందర్భంగా ఆయన నాలుగు విత్తనాల నమూనాలను సేకరించి పరీక్షకు పంపించారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి గుత్తుల సత్యనారాయణ పాల్గొన్నారు.

వెన్నుపోటు దినం విజయవంతం చేయండి

విశాలాంధ్ర - నిడదవోలు : వైసీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం ఉదయం 10:00 గంటలకు నిడదవోలు పట్టణంలో నిర్వహించనున్న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిడదవోలు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు ఇస్తామని ప్రజలను నమ్మించి అధికారం లోకి వచ్చి ఏడాది అవుతున్నా ఒక్క పథకం కూడా అమలు చేయకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచిందన్నారు. నిడదవోలు నియోజకవర్గ వైసీపీ కార్యాలయం నుండి స్థానిక గణేష్ చౌక్, చాగల్లు రోడ్డు మీదగా మండల రెవిన్యూ కార్యాలయం వరకు నిరసన ర్యాలీగా వెళ్లి ఎమ్మార్వోకు విన్నతపత్రం అందజేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వైసీపీ నాయకులు, పట్టణ మున్సిపాలిటీ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

సేవకు ప్రతిరూపం ఆమెన్ ట్రస్ట్

విశాలాంధ్ర-దేవరపల్లి: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల కళ్లను కంటికి రెప్పలా కాపాడేందుకు పల్లె పల్లెనా విస్తృతంగా ఉచిత కంటి వైద్య శిబిరాలను నిర్వహిస్తున్న స్వచ్ఛంద సేవా సంస్థ ఆమెన్ ట్రస్ట్ సేవకు ప్రతిరూపమని ఆంధ్రప్రదేశ్ వైద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు జీవీవీప్రసాద్ కొనియాడారు. దేవరపల్లి మండలం దుద్దుకూరు షాలోమ్ టెంపుల్ ఆవరణలో ఆమెన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన ఉచిత కళ్ళజోళ్ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రసాద్ మాట్లాడుతూ పోషకాహార లేమితో కంటి సంబంధిత ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం వుందన్నారు. వైద్యుల సలహా మేరకు తగిన జాగ్రత్తలు తీసుకుని కంటిని పరిరక్షించుకోవాలని హితవు పలికారు. ఆమెన్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు ఇవాంజలిన్ అశోక్ మాట్లాడుతూ వేమగిరి పరమహంస యోగానంద కంటి ఆసుపత్రి వారి సహకారంతో గతవారం నిర్వహించిన ఈ ఉచిత కంటి పరీక్షల కార్యక్రమానికి విశేష స్పందన లభించిందన్నారు. దాదాపు ఐదు వందల మంది క్యాంపునకు రాగా అందులో 20 మందికి ఉచితంగా కంటి శస్త్రచికిత్సలు నిర్వహించామన్నారు. కళ్ళజోళ్ళు అవసరమైన 120 మందికి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచితంగా కళ్ళజోళ్లను అందజేసినట్టు చెప్పారు. మలేరియా నివారణ మాసోత్సవాలను పురస్కరించుకొని దుద్దుకూరుతో పాటు పలు ప్రాంతాల్లో త్వరలోనే దోమతెరలను పంపిణీ చేయనున్నామని వెల్లడించారు. దుద్దుకూరు సొసైటీ మాజీ అధ్యక్షులు కాండ్రు రామకృష్ణ మాట్లాడుతూ ఆమెన్ ట్రస్ట్ సేవలను కొనియాడారు. కార్యక్రమాన్ని షాలోమ్ టెంపుల్ నిర్వాహకులు కొడవటి బుజ్జిబాబు నిర్వహించారు.

సత్యనారాయణరెడ్డికి ఎమ్మెల్యే పరామర్శ

విశాలాంధ్ర - అనపర్తి : ఇటీవల రామవరంలో సత్తి సత్యనారాయణరెడ్డి పశువుల శాల షార్ట్ సర్క్యూట్ వలన అగ్ని ప్రమాదానికి గురై ఒక ఆవు దూడ, గేదె మృతి చెందాయి. మంగళవారం సత్యనారాయణరెడ్డి ఇంటికి ఎమ్మెల్యే నల్లమిల్లి వెళ్ళి అగ్ని ప్రమాదం ఏ విధంగా జరిగిందో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట గ్రామ ఎన్‌డి ఏ నాయకులు,కార్యకర్తలు ఉన్నారు.

మునిసిపల్ విభాగం వైసీపీ జిల్లా అధ్యక్షులుగా బాలరాజు నియామకం

విశాలాంధ్ర - నిడదవోలు : తూర్పుగోదావరి జిల్లా మున్సిపల్ విభాగం వైసీపీ అధ్యక్షుడిగా నిడదవోలు మున్సిపల్ వైస్ చైర్మన్ యలగాడ బాలరాజు నియమితులయ్యారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీకి, ప్రజలకు విశిష్ట సేవలందిస్తున్న బాలరాజును మునిసిపల్ విభాగం వైసీపీ అధ్యక్షులుగా నియమించినట్లు కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. బాలరాజును మాజీ ఎమ్మెల్యే జి. శ్రీనివాస్ నాయుడు, పట్టణ వైసీపీ అధ్యక్షులు కామిశెట్టి సత్తిబాబు, కౌన్సిలర్లు, పార్టీ శ్రేణులు అభినందించారు.

రేషన్ పంపిణీ విధానాన్ని పరిశీలించిన కలెక్టర్ చదలవాడ

విశాలాంధ్ర -భీమవరం: దివ్యాంగులు, దీర్ఘకాలిక అస్వస్థులు, వయోవృద్ధులు రేషన్ సరుకులు పొందడంలో చింత లేదని, వారి ఇంటి వద్దకే డీలర్లు అందజేస్తున్నారని కలెక్టర్ చదలవాడ నాగరాణి స్పష్టం చేశారు. మంగళవారం పట్టణంలోని ఏడవ వార్డు గాంధీనగర్‌లో స్థానిక రేషన్ డీలర్ నారి నరసింహా రావు దీర్ఘకాలం అస్వస్థతతో మంచానికే పరిమితమైన గుమ్మళ్ళ రామారావు, వయోవృద్ధులు సిద్ధిరెడ్డి రామారావు కుటుంబాల ఇంటి వద్దకే వెళ్ళి పంపిణీ చేస్తున్న రేషన్ ప్రక్రియను కలెక్టర్ చదలవాడ నాగరాణి, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి క్షేత్రస్థాయిలో సంయుక్తంగా పరిశీలించారు. ఈ సందర్భంగా రేషన్ లబ్ధిదారులతో మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. జూన్ నెల నుండి మీ ఇంటి వద్దకే డీలర్ స్వయంగా వచ్చి రేషన్ అందజేయనున్నట్టు కలెక్టర్ లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. జిల్లాలోని మొత్తం 1,052 చౌక ధరల దుకాణాల పరిధిలో 5,58,019 రేషన్ కార్డులు ఉండగా, జూన్ మూడు నాటికి 1,78,583 మంది లబ్ధిదారులు స్వయంగా చౌక ధరల దుకాణానికి వచ్చి రేషన్ తీసుకు వెళ్ళడం జరిగిందని, 32 శాతం రేషన్ పంపిణీ పూర్తయ్యిం దని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, భీమవరం తహసీల్దార్ రావి రవికుమార్, డీ.ఎస్.ఓ సరోజ, ఏఎస్ఓ రవిశంకర్, సిఎస్ ఆర్ఐ ఎ.సురేష్, వీఆర్వో ఎ. సూర్యకాంతం, తదితరులు ఉన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం చేయూత

విశాలాంధ్ర - నిడదవోలు : ఆర్థికంగా వెనుకబడిన పేదింటి మహిళలకు స్వయం ఉపాధి కల్పించడం, తద్వారా కుటుంబానికి ఆర్థిక భరోసా అందించాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. మంగళవారం నిడదవోలు మండల పరిషత్ కార్యాలయంలో బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్, ఈడబ్ల్యూఎస్ సహకారంతో ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి కుట్టు మిషన్ల శిక్షణ కేంద్రం (టైలరింగ్)ను కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళామణులకు ఆత్మగౌరవం, ఆర్థిక స్వావలంబన కల్పించే లక్ష్యంతో ఉచిత కుట్టు మిషన్ కేంద్రాలు పనిచేస్తాయని తెలిపారు. 90 రోజులపాటు అందించే ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమానికి క్రమం తప్పకుండా హాజరై నైపుణ్యాన్ని పెంచుకోవాలని తద్వారా ఆర్థిక పరిపుష్టి సాధించాలని సూచించారు. నియోజకవర్గవ్యాప్తంగా వివిధ కార్పొరేషన్ల ద్వారా ఆర్థికంగా వెనకబడిన వర్గాలకు చెందిన దాదాపు 496 మందికి ప్రభుత్వం అవకాశం కల్పిస్తే నిడద వోలులో మాత్రం తాము 540 మందికి అవకాశం కల్పించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నిడదవోలు మున్సిపల్ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ, జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజక వర్గ సభ్యులు కొయ్యే సూర్యారావు, మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు తిరుమళ్ల భాగ్యలక్ష్మి దుర్గారావు, పెండ్యాల ఎంపీటీసీ వాకా శ్రీను, ఎంపీడీవో లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తాం : ఎమ్మెల్యే, మేయర్

– 54 లక్షలతో 9 ట్రాక్టర్లు కొనుగోలు

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : నగరాన్ని స్వచ్ఛ ఏలూరుగా తీర్చిదిద్దేందుకు ముందస్తు ప్రణాళికతో వెళ్తున్నామని ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య, నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు అన్నారు. రాబోయే వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని పారిశుధ్య పనులకు ఆటంకం కలగకూడదని నూతన ట్రాక్టర్లు కొనుగోలు చేసినట్లు వివరించారు. 15వ ఆర్థిక సంఘం నిధులు 54 లక్షల రూపాయలతో నూతనంగా కొనుగోలు చేసిన 9 ట్రాక్టర్లను ఎమ్మెల్యే బడేటి చంటి, మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు మంగళవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడేటి మాట్లాడుతూ నగర పాలక సంస్థలో చాలా వరకు ట్రాక్టర్లు మరమ్మతులకు గురై చెత్త సేకరణకు ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఈ తరుణంలో రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని ఆర్థిక సంఘం నిధులతో 9 కొత్త ట్రాక్టర్లు కొనుగోలు చేశామన్నారు. నూతనంగా కొనుగోలు చేసిన ట్రాక్టర్లలో 3 ట్రాక్టర్లు మంచినీటి సరఫరాకు, 6 ట్రాక్టర్లు పారిశుద్ధ్య నిర్వహణ పనులకు ఉపయోగిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్.పెదబాబు, డిప్యూటీ మేయర్లు పప్పు ఉమా మహేశ్వరరావు, వందనాల దుర్గా భవాని, కో-ఆప్షన్ సభ్యులు చోడే వెంకటరత్నం, అదనపు కమిషనర్ జి.చంద్రయ్య, ఎంఈ సురేంద్రబాబు, డిఈ రజాక్, ఏఈ సాయి, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు కలెక్టర్ అభినందనలు

విశాలాంధ్ర - కాకినాడ : ఇటీవల విడుదలైన సీబీయస్ఈ 10వ తరగతి పరీక్షల్లో కాకినాడ పీఎం కేంద్రీయ విద్యాలయం విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణతతో విజయ కేతనం ఎగరవేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు మంగళవారం కాకినాడ కలెక్టరేట్‌లో కేంద్రీయ విద్యాలయం చైర్మన్, జిల్లా కలెక్టర్ షణ్మోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ బి. శేఖర్ విద్యార్థులు సాధించిన ప్రగతిని కలెక్టర్‌కు తెలియజేశారు. పరీక్షలలో 100 శాతం ఉత్తీర్ణతతో మంచి మార్కులు సాధించిన దేవ్ హాసన్, స్నేహ శరణ్య, కె.భాను సూర్యశ్రీ, జి. హాసినిలను, తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. ఇదే స్ఫూర్తి భవిష్యత్తులోను కొనసాగిస్తూ పట్టుదలతో ఉన్నత స్థాయికి ఎదిగేందుకు కృషి చేయాలని కలెక్టర్ విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో కేంద్రీయ విద్యాలయ వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఇతర ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిబంధనలు బేఖాతరు

ఇసుక అక్రమ రవాణా

విశాలాంధ్ర - సీతానగరం: ప్రభుత్వ నిబంధనలు బేఖాతరు చేస్తూ ఇసుక తవ్వకాలు కొనసాగుతున్నాయి. సీతానగరం మండలంలోని మునికూడలి గ్రామ పంచాయతీ పరిధిలో గత కొద్ది కాలంగా ఇసుక ర్యాంపు నిర్వహిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణ, అటవీ మంత్రిత్వ శాఖ నిబంధనల ప్రకారం జూన్ 1వ తేదీ నుంచి అక్టోబర్ 15 వరకు ఇసుక తవ్వకాలు నిలిపివేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ నిబంధనలు మాకేమి పట్టవు అన్నట్టు మంగళవారం మునికూడలి ఇసుక ర్యాంపులో యథేచ్ఛగా యంత్రాలను ఉపయోగించి పర్యావరణానికి హాని కలిగించే విధంగా ఇసుక తవ్వకాలు జరిపారు. దీనిపై తహసీల్దార్ శ్రీనివాస్‌ను వివరణ కోరగా ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇసుక ర్యాంపుల్లో ఏ విధమైన ఇసుక తవ్వకాలు జరపరాదని, ఒక వేళ జరిపితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

తక్షణమే మున్సిపల్ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - అమలాపురం : ఆంధ్రప్రదేశ్ మునిసిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ పిలుపు మేరకు అమలాపురం మునిసిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో తమ హక్కుల సాధన కోసం వాటర్ సప్లై, వీధి దీపాలు నిర్వహణ, ఆఫీస్ సిబ్బంది ఈనెల 1వ తేదీ నుంచి విధులను బహిష్కరించి సమ్మె బాట పట్టారు.

ఈ సందర్భంగా మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద మోకాళ్లపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ యూని యన్, ఇంజనీరింగ్ కార్మికుల గౌరవాధ్యక్షుడు ఎం. దుర్గ అర్జునరావు, యూనియన్ అధ్యక్షులు దంగేటి షణ్ముఖరావు, ప్రధాన కార్యదర్శి యెరుబండి వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ ఇంజనీరింగ్ కార్మికుల జీతాలు టెక్నికల్, నాన్ టెక్నికల్‌గా పెంచి ఇవ్వాలన్నారు. సీనియారిటీ ప్రకారం ప్రమోషన్ ఇవ్వాలని, దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని కోరారు. రిటర్మెంట్ వయస్సు 60 నుండి 62కు పెంచాలని, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షులు నాగరపు శ్రీనివాస్, సభ్యులు చిక్కాల తిరుమల వెంకట కుమార్, ఎం. మధు, డి.కృష్ణ, బోనం రమేష్, గంటి రమేష్, ఆర్. నాగేశ్వరరావు, నరేష్, వల్లి శంకర్, సీహెచ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు తీరుపై రైతుల ఆందోళన



విశాలాంధ్ర - అల్లవరం : ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సెంట్రల్ బ్యాంక్ సీఈవో పంపిన సర్క్యులర్ పై రైతులు ఆందోళన చేశారు. ఆదివారం కొమరగిరిపట్నం మెట్ల రామ్మూర్తి సహకారసంఘంలో రేషన్ షాపు ప్రారంభోత్సవానికి వచ్చిన ఎమ్మెల్యే ఐతాబత్తుల ఆనందరావుకు రైతులు సెంట్రల్ బ్యాంక్ సీఈవో సహకార సంఘాలకు పంపిన సర్క్యులర్‌ను వివరించారు. దీనిపై సీఈవో కొమ్మూరి సత్తిబాబును ఎంఎల్ఏ ఆనందరావు వివరణ కోరారు. కూటమి ప్రభుత్వానికి ఇబ్బంది కలిగే పనులు చేయరాదని సూచించారు. సర్క్యులర్‌ను వెనక్కి తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. సెంట్రల్ బ్యాంక్ సీఈవో సహకార సంఘాలకు పంపిన సర్క్యులర్ రైతులకు ఇబ్బంది కలిగేలా ఉందన్నారు. వివరాల్లోకి వెళ్తే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వ్యవసాయదారులకు 2025-26. సంవత్సరాలకు పంట రుణములు మంజూరు చేసిన వాటికి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ కంటే అధికంగా ఇచ్చిన పంట రుణములను వడ్డీ రేటు 11% వసూలు చేయవలసిందిగా జూన్ 30వతేదీన బ్యాంక్ సీఈఓ సర్క్యులర్ జారీ చేశారు. గతంలో వరదలు, అనావృష్టి సమయంలో రైతులకు ఉన్న అప్పుపై 50% పెంచి అప్పులు ఇచ్చారు. ఈ సర్క్యులర్‌లో పేర్కొన్న కొన్ని అంశాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. 65 సంవత్సరములు నిండిన రైతులకు క్రాప్‌లోన్ కొత్త అప్పులు ఇవ్వరాదని సర్క్యులర్‌లో పేర్కొన్నారు. దీనివల్ల రైతులు చాలా నష్టపోతున్నారు. దీనిపై ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సర్క్యులర్ వెనక్కి తీసుకోవలసిందిగా రైతులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి మెట్ల రమణబాబు, అర్బన్ డెవలప్మెంట్ చైర్మన్ అల్లాడి సోమనాయుడు, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ సత్తిబాబు రాజు, గ్రామ సర్పంచ్ రాపాక విజయలక్ష్మి, డీసీఎం చైర్మన్ దాట్ల గోపిరాజు, ఎంపీటీసీ మామిడి శెట్టి శ్రీనివాస్, తాసిల్దార్ నరసింహారావు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ మన్యం సుబ్రహ్మణ్యం, గుని శెట్టి రోహిణి కుమార్, పరసా కిరణ్, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.